aruhi
aruhi group
BBTV
BBTV TELUGU

www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం 28-09-2026 సంపుటి:01 సంచిక:187 పేజీలు:08 వెల:₹5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

ఉగ్రవాదంపై నో కాంప్రమైజ్!

- పాకిస్థాన్ ఉగ్రవాదం కొనసాగిస్తే సైనిక చర్యకైనా సిద్ధం
- జాతీయ భద్రత విషయంలో రాజీ ప్రసక్తే లేదు
- భారత్ శాంతిని కోరుకుంటుంది.. బలహీనతగా భావించొద్దు
- ఇతర దేశాల భూభాగంపై భారత్‌కు కన్ను లేదు
- ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే దేశాలతో చర్చలకు నో
- భారత్‌కు 'థుసిడైడ్స్ ట్రాప్' వర్తించదు
- సుదీర్ఘ నాగరికతకు ప్రతీకగా భారత్ శక్తి
- జాతీయ ప్రయోజనాలు, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి ప్రాధాన్యం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం

భారత్‌లో కలపాలంటూ
పీవోకేలో భారీ నిరసనలు

- 110వ రోజుకు చేరిన పీవోకే ప్రజల ఆందోళనలు
- మంధోల్‌లో భారీ నిరసన.. 25 వేల మంది పాల్గొన్నట్లు సమాచారం
- ఎల్‌వోసీకి కేవలం 7 కిలోమీటర్ల దూరంలో నిరసన
- పీవోకేను భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లో కలపాలని డిమాండ్
- ఎల్‌వోసీని రద్దు చేసి రాకపోకలు సాగించాలని నినాదాలు
- రెండు ప్రాంతాల మధ్య రవాణా మార్గం తెరవాలని డిమాండ్
- పాక్ ప్రభుత్వం రేషన్ కూడా ఇవ్వడం లేదని అమన్ ఖాన్ ఆరోపణ
- పాక్ ప్రభుత్వ వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమం
- పీవోకేను ప్రత్యేక దేశంగా గుర్తించాలని పాక్‌కు డిమాండ్
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆందోళనకారుల ప్రకటన



నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

సీఎంగా బాధ్యతలు చేపట్టాక 78వ ఢిల్లీ పర్యటన



- రెండు రోజులపాటు ఢిల్లీలోనే సీఎం
- మీడియా సంస్థ కార్యక్రమానికి హాజరు
- కాంగ్రెస్ ముఖ్య నేతలతో రేవంత్ భేటీ
- మంగళవారం ఏఐసీసీ సమావేశానికి హాజరు
- సమావేశం అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనం
- ఆలస్యమైతే బుధవారం ఉదయం నగరానికి రాక
- బుధవారం సిరిసిల్లలో సీఎం పర్యటన

హైదరాబాద్, సెప్టెంబర్ 27 మహాప్రభ

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఢిల్లీకి వెళ్లడం ఇది 78వసారి. రెండు రోజులపాటు ఢిల్లీలోనే ఉండనున్న సీఎం.. ఈ పర్యటనలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలతోపాటు పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణామాలపై పార్టీ ముఖ్యులతో చర్చించే అవకాశం ఉంది. సోమవారం ఢిల్లీ చేరుకున్న అనంతరం రేవంత్‌రెడ్డి ఓ మీడియా సంస్థ నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ కార్యక్రమం అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులతో -మిగతా 3 లో



30 రోజుల వ్యాలిడిటీతో
రీఛార్జ్ ప్లాన్స్!

- 28 రోజుల ప్లాన్‌ల స్థానంలో 30 రోజుల వ్యాలిడిటీ
- అందుబాటులో వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ ప్లాన్స్ సైతం
- 12 సార్లు రీఛార్జ్ చేస్తే ఏడాది పాటు సేవలు
- డేటా అవసరం లేని వారికి ప్రత్యేక రీఛార్జ్‌లు
- రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడి



దక్షిణాఫ్రికాలో సామూహిక కాల్పులు..



సర్'కు తొలి పరీక్ష
ఖైరతాబాద్!

- ఉప ఎన్నికకు రంగం సిద్ధం
- ఓటర్ల జాబితాలో భారీ మార్పులు
- 1.23 లక్షల పేర్లు తొలగింపు
- 81,404 మందికి నోటీసులు
- తుది ఓటర్ల జాబితాపై ఉతంఠ

హైదరాబాద్, , సెప్టెంబర్ 27 మహాప్రభ

రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ తొలి పరీక్షకు సిద్ధమవుతున్నది. 'సర్' ముగిసిన తర్వాత జరుగబోయే తొలి ఎన్నికలుగా ఖైరతాబాద్ బైపోల్ ప్రాధాన్యం సంతరించుకున్నది. దానం నాగేందర్ అనర్హతకు సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. నిబంధనల ప్రకారం ఖాళీ అయిన అసెంబ్లీ స్థానానికి ఆరు నెలల్లోగా ఉపఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఈలోగా 'సర్' ప్రక్రియ కూడా పూర్తికానున్నది. అయితే, ప్రస్తుతం 'సర్' ప్రక్రియలో ఓటర్ల జాబితాలో భారీగా మార్పులు చోటుచేసుకోవడం ఉపఎన్నికపై ఆసక్తిని మరింత పెంచుతున్నది.సర్' ప్రక్రియ ప్రారంభానికి -మిగతా 3 లో



తెలంగాణలో మళ్లీ ఎండలు

- వారం రోజుల వర్షాలకు బ్రేక్.. ఇక పొడి వాతావరణం
- నేటి నుంచి పెరగనున్న ఉష్ణోగ్రతలు
- చాలా ప్రాంతాల్లో 34--35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు
- ఉదయం వేళల్లో మాత్రం చల్లటి వాతావరణం
- సెప్టెంబర్ 29న దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు
- కర్ణాటక సరిహద్దు జిల్లాల్లో ఉరుములతో కూడిన వానలు
- అక్టోబర్ 2 వరకు మిగతా ప్రాంతాల్లో పొడి వాతావరణం
- ఆ తర్వాత ఆగ్నేయ తెలంగాణలో తేలికపాటి వర్షాలకు అవకాశం

హైదరాబాద్, , సెప్టెంబర్ 27 మహాప్రభ

తెలంగాణలో వాతావరణం మరోసారి మారనుంది. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో.. నేటి నుంచి వర్షాలు తగ్గి ఎండలు పెరిగే అవకాశం ఉందని వెదర్‌మ్యాన్ బాలాజీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం నిర్మలంగా ఉండటంతో పాటు పొడి గాలులు వీచే అవకాశం ఉందన్నారు. దీంతో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయని పేర్కొన్నారు. నేటి నుంచి చాలా ప్రాంతాల్లో 34 నుంచి 35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఉదయం వేళల్లో మాత్రం వాతావరణం చల్లగా ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 29న కర్ణాటక సరిహద్దులోని దక్షిణ తెలంగాణ ప్రాంతాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా తెలంగాణ ప్రాంతాల్లో అక్టోబర్ 2 వరకు వాతావరణం పొడిగానే ఉండే అవకాశం ఉందని బాలాజీ పేర్కొన్నారు. ఆ తర్వాత గాలుల దిశలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆగ్నేయ తెలంగాణలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు సమీపంలోని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. -మిగతా 3 లో

మరోసారి నేపాల్‌లో ప్రకృతి విలయం



- హిమ్‌లుంగ్ హిమాల్ బేస్‌క్యాంప్‌పై విరిగిపడిన మంచుకొండ
- ప్రమాదంలో పలువురు పర్వతారోహకులు, సహాయక సిబ్బంది గల్లంతు
- 10 మంది ఆచూకీ లభించలేదన్న అధికారులు
- టిబెట్ సరిహద్దుల్లోని మనాంగ్ జిల్లాలో ఘటన
- భారీ మంచు, వర్షాలతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం
- హెలికాప్టర్ల రాకపోకలపై ప్రత్యేక అనుమతుల నిబంధన
- గల్లంతైన వారి కోసం రెస్క్యూ బృందాల ముమ్మర గాలింపు
- వర్షాలు, హిమపాతంతో నేపాల్‌లో ప్రతికూల వాతావరణం
- రహదారులు దెబ్బతిని పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం
- వాతావరణం శాంతించే వరకు పర్వతారోహణ కార్యకలాపాలు నిలిపివేత

రెండేళ్లలో కేసీఆర్ వస్తారు

30శాతం కమిషన్లతో రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీశారు



- పోలీసులు డిజేలను బంద్ చేస్తున్నారు
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే మోసం చేసి కాంగ్రెస్‌లోకి వెళ్లాడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు షాక్
- కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ నాయకుల భారీ చేరికలు

శంషాబాద్, , సెప్టెంబర్ 27 మహాప్రభ

రాష్ట్రంలో మరో రెండేండ్లలో రాజకీయ మార్పు వస్తుందని, కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరుపై ప్రజల్లో రోజురోజుకు నిరాశ, నిస్పృహలు పెరుగుతున్నాయని చెప్పారు. గత పది, పదకొండు రోజులుగా హైదరాబాద్‌లో ఒక నేతకు నిద్ర పట్టడం లేదని, పోలీస్ కమిషనర్ ప్రెస్ మీట్ పెట్టి ఏ పాట పెట్టాలి, ఏ పాట పెట్టకూడదని చెప్పే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. శాంతి భద్రతలను పర్యవేక్షించాల్సిన పోలీసులను బంద్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. -మిగతా 3 లో



యూపీలో భారీ
వర్షాల బీభత్సం..

- మూడు రోజుల్లో వర్షాల కారణంగా 56 మంది మృతి
- మరో 46 మందికి గాయాలు
- సీతాపుర్‌లో అత్యధికంగా ఏడుగురు మృతి
- 56 జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం
- ఫరూఖాబాద్‌లో 7,385 శాతం అధిక వర్షం
- వెయ్యికిపైగా ఇళ్లు ధ్వంసం
- ఘాఘ్రా, రాప్తి నదుల్లో పెరుగుతున్న నీటిమట్టం
- గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా నిలిచిన వర్షపు నీరు

మణిపూర్‌లో ఇద్దరు నాగా పౌరుల కాల్చివేత..

-మూడు రోజుల్లో రెండో ఘటన



ఇంఫాల్ ,సెప్టెంబర్ 27 మహాప్రభ

మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు కొనసాగుతున్నాయి. తాజాగా ఇద్దరు నాగా పౌరులను సాయుధ వ్యక్తులు కాల్చి చంపారు. ఈ కాల్పుల్లో మరో ఇద్దరు నాగా పౌరులు గాయపడ్డారు. భద్రతా దళాలు సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాయి. సేనాపతి జిల్లాలోని కాలెన్‌జాంగ్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం గ్రామ పెద్దకు చెందిన ఇంట్లో ఉన్న నాగా పౌరులపై గుర్తు తెలియని సాయుధ వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు నాగా పౌరులు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. మృతులను ఆ జిల్లాలోని వేర్వేరు గ్రామాలకు చెందిన రాకీ, కుమార్‌గా గుర్తించారు. కుకీ తెగకు చెందిన వ్యక్తులు ఈ కాల్పులకు పాల్పడినట్లు స్థానికులు ఆరోపించారు.కాగా, ఈ కాల్పుల సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. భారత్-మయన్మార్ సరిహద్దు సమీపంలోని కామ్‌జోంగ్ జిల్లాలో జరిగిన సాయుధ దాడిలో నలుగురు నాగా పౌరులు మరణించిన రెండు రోజుల తర్వాత తాజాగా ఈ హత్యలు జరిగాయి. ఈ నేపథ్యంలో నాగా ప్రజల భద్రతపై ఆ తెగల సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. మణిపూర్ ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ ఈ ఘటనను ఖండించారు. నిరపరాధుల ప్రాణాలపై జరిగిన పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు.

సర్'ను రద్దు చేయండి

ఎన్నికల సంఘం పనితీరుపై దర్యాప్తునకు ఆదేశించండి

సీజేఐకి 2 వేల మందికి పైగా పౌరుల బహిరంగ లేఖ



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 27 మహాప్రభ

కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'సర్'లో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని 2 వేల మందికి పైగా పౌరులు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు ఇటీవల లేఖ రాశారు. 'సర్' విషయంలో న్యాయ వ్యవస్థ వెంటనే జోక్యం చేసుకోవాలని, సుమోటోగా స్వీకరించాలని కోరారు. సర్‌పై వెంటనే స్టే విధించి దాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ లేఖపై మాజీ రాజ్యసభ ఎంపీ జవహర్ సిర్కార్, ఆర్థికవేత్తలు జయతీ ఘోష్, కమల్ మల్హోత్రా, రిటైర్డ్ ప్రొఫెసర్లు ఆదిత్య, మృదుల ముఖర్జీ, ఆర్టీఐ కార్యకర్త అంజలి భరద్వాజ్ తదితరులు సంతకాలు చేశారు.విద్యావేత్తలు, న్యాయవాదులు, మాజీ సివిల్ సర్వెంట్లు, సామాజిక కార్యకర్తలు, పాత్రికేయులు, రిటైర్డ్ సైనిక ఉద్యోగులు సీజేఐకు ఈ బహిరంగ లేఖ రాస్తూ.. ఈసీ పనితీరుపై, దాని కేంద్రీకృత ఈసీఐనెట్ టెక్నాలజీపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలన్నారు. స్థానిక ఎన్నికల అధికారులను కాదని ఈ టెక్నాలజీ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయడం ప్రజా ప్రాతినిధ్య చట్టానికి విరుద్ధమని తెలిపారు. ఈ విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఇతర అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల మధ్య అంతర్గత భిన్నాభిప్రాయాలు ఉండటంపై లేఖ రాసిన పౌరులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫామ్-6 మార్పులపైనా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సాంకేతిక లోపాలు, సాఫ్ట్‌వేర్ లాక్ లేదా విధానపరమైన మార్పుల వల్ల తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కోరారు.

మైనర్ భార్యతో శారీరక సంబంధం నేరమే!

పోక్సో నుంచి మినహాయింపు ఉండదు: ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ:,సెప్టెంబర్ 27 మహాప్రభ

ముస్లిం పర్సనల్ లా ప్రకారం వివాహం చెల్లుబాటు అయినప్పటికీ.. 18 ఏండ్లలోపు బాలికతో శారీరక సంబంధం పెట్టుకున్నప్పుడు పోక్సో చట్టం కింద నేరం నుంచి మినహాయింపు లభించదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. మైనర్ బాలికతో వివాహాన్ని కారణంగా చూపి, పోక్సో చట్టం కింద నమోదైన కేసు నుంచి తప్పించుకునే అవకాశం కల్పిస్తే, ఆ చట్టం ఉద్దేశం దెబ్బతింటుందని కోర్టు పేర్కొంది. జస్టిస్ సంజీవ్ నరులా ఇచ్చిన ఉత్తర్వులో ఈ వ్యాఖ్యలు చేశారు.మైనర్ అయిన తన భార్యపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణతో నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. కేసు ప్రకారం బాలికకు 16 ఏండ్ల మూడు నెలలు. ఆమె భర్తకు 28 ఏండ్లు. గర్భధారణ సమయంలో ఆమె వయసు వెలుగులోకి వచ్చింది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఆ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఐరాసలో ఇండియా శాశ్వత సభ్యత్వానికి రష్యా మద్దతు..

-పశ్చిమ దేశాలకు నో



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 27 మహాప్రభ

ఐక్యరాజ్యసమితిలో ఇండియాకు శాశ్వత సభ్యత్వం కల్పించే ప్రతిపాదనకు తాము మద్దతు ఇస్తున్నామని రష్యా ప్రకటించింది. అలాగే, పశ్చిమ దేశాలకు మాత్రం ఈ విషయంలో చోటు లేదని కూడా రష్యా స్పష్టం చేసింది. అమెరికా, న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సాధారణ సర్వసభ్య వార్షిక సమావేశం (యూఎన్‌జీఏ) జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడారు.ఇండియా శాశ్వత సభ్యత్వానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఏ పాశ్చాత్య దేశానికి కొత్తగా శాశ్వత సభ్యత్వం కల్పించేందుకు తాము వ్యతిరేకం అని లావ్రోవ్ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చేపడుతున్న సంస్కరణలు కౌన్సిల్ ప్రగతిని, శాశ్వత దేశాల అభివృద్ధిని అడ్డుకోకూడదని అభిప్రాయపడ్డారు. సంస్కరణల పేరుతో పాశ్చాత్య దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించడానికి తాము వ్యతిరేకం అన్నారు. ముఖ్యంగా జర్మనీ, జపాన్ వంటి దేశాలకు మద్దతు ఇవ్వబోమని చెప్పారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు సరైన ప్రాతినిధ్యం ఉండాలన్నారు. ఇండియాతోపాటు బ్రెజిల్‌కు శాశ్వత సభ్యత్వం విషయంలో తాము మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.ఐరాసలో ఇండియా శాశ్వత సభ్యత్వం కోసం పోర్చుగల్, మారిషస్ కూడా మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఐరాసలో ఆయా దేశాలు ప్రకటన కూడా చేశాయి. ప్రస్తుతం చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, అమెరికా మాత్రమే ఐరాసలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్నాయి. వీటికి వీటో అధికారం ఉంటుంది. అలాగే, పది దేశాలు కూడా తాత్కాలిక సభ్య దేశాలకు వీటో ఉంటుంది. వీటి కాలపరిమితి రెండేళ్లు. ప్రతి

బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తి అనుమానాస్పద మృతి



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 27 మహాప్రభ

బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందడం కలకలం రేపుతోంది. మైమన్‌సింగ్ జిల్లాలోని బెగున్‌బరి ప్రాంతంలో కాలువ తూము గేటు సమీపంలో నీటిపై తేలుతున్న ప్లాస్టిక్ డ్రమ్ములో ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడిని 50 ఏళ్ల నిరంజన్ చంద్ర సూత్రధార్‌గా గుర్తించారు. ఆయన మైమన్‌సింగ్ పట్టణంలోని అథర్‌బరి బిల్డింగ్ ప్రాంతంలో మరో వ్యక్తితో కలిసి నగల దుకాణం నిర్వహించేవారు. నీటిలో డ్రమ్ము తేలుతుండటాన్ని గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని డ్రమ్మును బయటకు తీసి పరిశీలించగా అందులో మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. మృతదేహంపై తల, ఛాతి ప్రాంతాల్లో పదునైన ఆయుధంతో దాడి చేసినట్లుగా కనిపించే గాయాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ గాయాల ఆధారంగా నిరంజన్‌ను ముందుగా హత్య చేసి ఉండవచ్చని.. అనంతరం మృతదేహాన్ని ప్లాస్టిక్ డ్రమ్ములో పెట్టి నీటిలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఘటనకు పాల్పడింది ఎవరు.. హత్యకు అసలు కారణం ఏమిటి.. అనే విషయాలు ఇంకా తెలియరాలేదు. మృతుడి గుర్తింపు విషయంలో ఆయన జేబులో లభించిన ఓ టోకెన్ కీలకంగా మారింది. అది మైమన్‌సింగ్ హిందూ కోఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ లిమిటెడ్ జారీ చేసిన టోకెన్‌గా పోలీసులు గుర్తించారు. దాని ఆధారంగా సంబంధిత సంస్థను సంప్రదించడంతో మృతుడు నిరంజన్ చంద్ర సూత్రధార్ అని గుర్తించారు.తర్వాత పోలీసులు కుటుంబ సభ్యులను సంప్రదించగా.. ఆయన భార్య సుమితా రాణి సూత్రధార్, కుమారుడు జాయ్ సూత్రధార్ మృతదేహాన్ని పరిశీలించి నిరంజన్‌దేనని ధ్రువీకరించారు. నిరంజన్ తన భార్య, కుమారుడితో కలిసి మైమన్‌సింగ్‌లోని స్టేడియం ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసించేవారు. ఈనెల 20వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. మరుసటి రోజు స్టేడియం ప్రాంతంలో ఆయన మేనల్లుడు చూసినట్లు సమాచారం. గతంలోనూ నిరంజన్ కొన్నిసార్లు కొన్ని రోజుల పాటు ఇంటికి దూరంగా ఉండి తిరిగి వచ్చేవారని కుటుంబ సభ్యులు భావించినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో ఆయన కనిపించకుండా పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయలేదని సమాచారం. నిరంజన్ మృతదేహంపై గాయాలు ఉండటంతో హత్య కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు హత్యకు కారణం ఏమిటనేది నిర్ధారణ కాలేదు. నిందితులు ఎవరనేది కూడా తెలియలేదు. ఈ కేసులో శుక్రవారం నాటికి ఎవరినీ అరెస్టు చేయలేదని బంగ్లాదేశ్ మీడియా నివేదించింది.

ఫిరాయింపుల్లో బీజేపీ నంబర్ వన్..

నాలుగేళ్లలో 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేల పార్టీ మార్పు
29 మంది బీజేపీలో చేరినట్టు ఏడీఆర్ నివేదిక
పార్టీ మారిన వారిలో 26 మంది లోక్‌సభ ఎంపీలు
ఏడుగురు రాజ్యసభ సభ్యులు.. 78 మంది ఎమ్మెల్యేలు
ఎక్కువ మంది ఫిరాయింపుదారులు నాగాలాండ్‌లోనే
పశ్చిమ బెంగాల్‌లో 20 మంది.. తెలంగాణలో తొమ్మిది మంది
దానం నాగేందర్ అనర్హతతో ఫిరాయింపులపై చర్చ
కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడమే దానంకు కీలకమైంది
సుప్రీంకోర్టులోనూ దానం నాగేందర్‌కు ఎదురుదెబ్బ
ఫిరాయింపులపై పదో షెడ్యూల్ నిబంధనలు
పార్టీ విలీనాల ద్వారా అనర్హత నుంచి తప్పించుకునే ప్రయత్నాలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 27 మహాప్రభ

తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపులపై హై కోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేల గుండెలదురుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి.. ఆపై కాంగ్రెస్ టికెట్‌తో ఎంపీగా పోటీ చేసినందుకు దానం నాగేందర్ సభ్యత్యం రద్దు కావడంతో మా పదవీ ఊడుతుందా? అని ఆందోళన చెందుతున్నారు పలువురు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా జంప్ జిలానీల జాబితా తీసింది డెమోక్రటిక్ రిఫార్మ్స్ అసోసియేషన్ . గత నాలుగేళ్లలోనే 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడగా.. వీరిలో 26 శాతం మంది జాతీయ పార్టీ అయిన బీజేపీ గూటికి చేరారని ఏడీఆర్ తెలిపింది. దాంతో.. ప్రతిపక్షాలను చీల్చుతూ ఈ గోడదూకే సంస్కృతిని పెంపొందిస్తున్న కాషాయ పార్టీపై మండిపడుతున్నారు.భారత దేశంలో ఇటీవల పార్టీ ఫిరాయింపులు చాలా సాధారణమయ్యాయి. ఓ పార్టీ టికెట్‌తో గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు కొందరు అభివృద్ధి సాకుతో పార్టీ మారుతున్నారు. మరికొందరిని జాతీయ పార్టీలు పదవుల ఆశ చూపి, ప్రలోభాలకు గురి చేసి తమ కండువా కప్పుతున్నాయి. ఫలితంగా రాజ్యంగబద్ధంగా జరిగే ఎన్నికలకు విలువే లేకుండా పోతుంది. ఈ క్రమంలోనే.. ఫిరాయింపుదారులకు చెంపపెట్టులాంటి తీర్పునిచ్చింది తెలంగాణ హై కోర్టుబీఆర్ఎస్ నుంచి గెలిచి.. కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఇకపై ఇలా కుదరదు అని అత్యున్నత ధర్మాసనం హెచ్చరికలు పంపింది. ఈ నేపథ్యంలో.. ప్రజాస్వామ్యంలో సంస్కరణల కోసం కృషి చేస్తున్న సంఘం(ూణ=), నేషనల్ ఎలక్షన్ వాచ్ తాజాగా దేశవ్యాప్తంగా ఫిరాయింపుల లెక్కలు తీశాయి. 2022 నుంచి 2026 వరకు.. ఈ నాలుగేళ్లలో ఏకంగా 111 మంది ఇతర పార్టీల్లోకి మారారని వెల్లడించాయి సంస్థలు.

బీజేపీలోకి 26 శాతం

మనదేశంలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న జాతీయ పార్టీల పరంగా బీజేపీ ముందు వరసలో ఉంది. ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ గణాంకాల ప్రకారం గత నాలుగేళ్లలో అత్యధికులుజాతీయ పార్టీ అయిన కమలం కండువా కప్పుకున్నారు. సెప్టెంబర్ 24న విడుదలైన నివేదిక ప్రకారం.. 2022 నుంచి 2026లో 111 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీలు మారారు. వీరిలో 26 మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్య సభ ఎంపీలు.. 78 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇంతమందిలో 26 శాతం అంటే 29 మంది కాషాయం పార్టీలోనే చేరారు. ఈమధ్యే రాఘవ్ చద్దా నేతృత్వంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఏడుగురు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలతో కలిపి 29 మంది అయ్యారని సమాచారం.అయితే.. అత్యధికంగా ఫిరాయింపు ఎంపీలు, ఎమ్మెల్యేలు నాగా పీపుల్స్ ఫ్రంట్ లో చేరారు. ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిలో ఏకంగా 32 మంది ఈ పార్టీలో భాగమయ్యారు. పదిహేడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను తీసుకుంటే.. నాగాలాండ్ 32 మంది ప్రతినిధులు జంప్ జిలానీలే. అనంతరం బెంగాల్‌లో 20 మంది.. తెలంగాణలో తొమ్మిది, గోవాతో పాటు పంజాబ్‌లో ఎనిమిదేసి మంది ఎమ్మెల్యేలు ఫిరాయింపులకు పాల్పడ్డారు. రాజ్యాంగం పదో షెడ్యూల్‌లోని ఫిరాయింపుల నిరోధక చట్టం(ూఅ్అ ణవటవష్ఱశీఅ ూఘఎ) ప్రకారం.. ఓ పార్టీ తరఫున గెలిచి మరో పార్టీకి మారడం నేరం. కానీ, కొందరు సంఖ్యా బలంతో శాసనసభా పక్షాన్ని అధికార పార్టీలో విలీనం చేస్తున్నారు. మరొకొందరేమో ఉప ఎన్నికలో విజయం తర్వాత పదవి కాంక్షతోనే, ప్రలోభాలకు గురయ్యో జాతీయ పార్టీల్లోకి వెళ్తున్నారు. ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని నిపుణులు వాపోతున్నా.. కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా సరే మన ప్రజా ప్రతినిధుల్లో మాత్రం మార్పు శూన్యం.

రోడ్ల నాణ్యతపై ప్రశ్నించినందుకు చెంపచెళ్లు!

యువకుడిపై చేయిచేసుకున్న ఢిల్లీ బీజేపీ మంత్రి పర్వేశ్ వర్మ

మంత్రి దౌర్జన్యంపై ఆప్ ఆగ్రహం



న్యూఢిల్లీ, ,సెప్టెంబర్ 27 మహాప్రభ

రోడ్డు దుస్థితిని తన ఫోన్‌లో రికార్డు చేసిన ఒక యువకుడిని ఢిల్లీ మంత్రి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ చెంప చెళ్లుమనిపించడం ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కొత్తగా వేసిన రోడ్డు నాణ్యతపై ఆదివారం మంత్రి, ఆప్ ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం జరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తిలక్‌నగర్‌లో నిర్మాణంలో ఒక రోడ్డును పరిశీలించడానికి మంత్రి వర్మ వచ్చారు. అదే సమయంలో స్థానిక ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ కూడా అక్కడికి వచ్చారు.ప్రమాణాల ప్రకారం కాకుండా నాసిరకంగా రోడ్డును నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే వర్మ ఆరోపించారు. వర్మతో ఉన్న వ్యక్తులు అప్పుడు వేసిన రోడ్డును చేతితో పెకిలించి ఇదేనా నాణ్యత? అని ప్రశ్నించగా, మంత్రికి, ఎమ్మెల్యేకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. రోడ్డు దుస్థితిని, నాయకుల వాగ్వాదాన్ని స్థానిక యువకుడొకరు వీడియో తీయడాన్ని గమనించిన మంత్రి అతడిని చెంపదెబ్బ కొట్టారు. దీనిపై ఆప్ తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వం వేస్తున్న నాసిరకం రోడ్ల నిర్మాణం గురించి ప్రజలకు ఎక్కడ తెలిసిపోతుందో అన్న భయంతోనే మంత్రి పోలీసుల అండతో ఈ దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరవ్ భరద్వాజ్ ఆరోపించారు. 'పోలీసులు, భద్రతా సిబ్బంది లేకుండా ఆ కుర్రాడితో తలపడండి చూద్దాం?' అని ఆయన మంత్రికి సవాల్ విసిరారు.

భారత్‌లో కలపాలంటూ పీవోకేలో భారీ నిరసనలు

110వ రోజుకు చేరిన పీవోకే ప్రజల ఆందోళనలు
మందోల్‌లో భారీ నిరసన.. 25 వేల మంది పాల్గొన్నట్లు సమాచారం
ఎల్‌వోసీకి కేవలం 7 కిలోమీటర్ల దూరంలో నిరసన
పీవోకేను భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లో కలపాలని డిమాండ్
ఎల్‌వోసీని రద్దు చేసి రాకపోకలు సాగించాలని నినాదాలు
రెండు ప్రాంతాల మధ్య రవాణా మార్గం తెరవాలని డిమాండ్
పాక్ ప్రభుత్వం రేషన్ కూడా ఇవ్వడం లేదని అమన్ ఖాన్ ఆరోపణ
పాక్ ప్రభుత్వ వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమం
పీవోకేను ప్రత్యేక దేశంగా గుర్తించాలని పాక్‌కు డిమాండ్
ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆందోళనకారుల ప్రకటన

న్యూఢిల్లీ



పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో కొంతకాలంగా ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తమను భారత్‌లో కలపాలంటూ పీవోకేలో స్థానిక ప్రజలు అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు. గత జూన్ 9న ప్రారంభమైన నిరసనలు శనివారం 110వ రోజుకు చేరాయి. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌ను ఇండియాలోని జమ్మూ కాశ్మీర్‌లో కలపాలని అక్కడి వారు డిమాండ్ చేస్తున్నారు. పీవోకేలోని మందోల్ గ్రామంలో శనివారం భారీ నిరసన ప్రదర్శన జరిగింది.ఈ ఆందోళనల్లో 25,000 మంది పాల్గొన్నారు. ఈ ఆందోళనలు జరిగిన ప్రాంతం లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌వోసీ)కి ఏడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. అంటే, ఇండియా సరిహద్దుకు ఏడు కిలోమీటర్ల దూరంలోనే. ఈ నిరసనపై అవామీ యాక్షన్ కమిటీ నేత సర్దార్ అమన్ ఖాన్ స్పందించారు. మూడు నెలలుగా పాక్ ప్రభుత్వం తమను వేధిస్తోందన్నారు. కనీసం ప్రభుత్వం రేషన్ కూడా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. పీవోకేకు, జమ్మూ కాశ్మీర్‌కు మధ్యలో ఉన్న ఎల్‌వోసీని రద్దు చేయాలా అని అక్కడ ఆందోళన చేస్తున్నవారిని ఆయన ప్రశ్నించారు. దీంతో ఆందోళనలో పాల్గొన్న వారంతా రద్దు చేయాలని నినదించారు. రెండు ప్రాంతాల మధ్య నియంత్రణ రేఖను తొలగించాలని, ఇండియాలో పీవోకేను కలపాలని డిమాండ్ చేస్తున్నారు. రెండు ప్రాంతాల మధ్య రవాణా మార్గాన్ని తెరవాలని కూడా వారు కోరుతున్నారు. ఇందుకోసం మరింతగా ఉద్యమించేందుకు సిద్ధమని ప్రకటించారు. పాక్ ప్రభుత్వం తమతో ఏదైనా ఒప్పందం చేసుకోవాలని అనుకుంటే తమను ప్రత్యేక దేశంగా గుర్తించాలని సర్దార్ ఖాన్ సూచించారు. పాక్ ఆర్మీ ఈ ప్రాంతాన్ని తమ దేశ భూభాగంగా చెప్పుకొంటుంది. అయితే, తమను బానిసల్లా చూస్తున్నారని ఖాన్ విమర్శించారు. తమను పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా దోచుకుంటూ, అణచివేతకు గురి చేస్తోందని ఆరోపించారు. పీవోకేలో జరుగుతున్న ఆందోళనల్ని పాక్ ప్రభుత్వం దారుణంగా అణచివేస్తోంది.

30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్స్!

-28 రోజుల ప్లాన్‌ల స్థానంలో 30 రోజుల వ్యాలిడిటీ
-అందుబాటులో వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ ప్లాన్స్ సైతం
-12 సార్లు రీఛార్జ్ చేస్తే ఏడాది పాటు సేవలు
-డేటా అవసరం లేని వారికి ప్రత్యేక రీఛార్జ్‌లు
-రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడి

న్యూఢిల్లీ



ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై 30 రోజుల వ్యాలిడిటీతో కూడిన రీఛార్జ్ ప్లాన్స్ అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఏడాదికి 13 నెలవారీ రీఛార్జ్‌లు చేసుకోవాల్సిన పరిస్థితికి బదులు 12 రీఛార్జ్‌లతోనే ఏడాది సేవలను కొనసాగించుకునే అవకాశం కలగనుంది.
ఈ మేరకు టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్స్-2026ను తీసుకొచ్చినట్లు రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తెలిపారు. కొత్త నిబంధనలతో వినియోగదారులకు మరిన్ని రీఛార్జ్ ఆప్షన్లు అందుబాటులోకి వస్తాయని రాఘవ్ చద్దా పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పరిమితమైన, సౌకర్యవంతంగా లేని రీఛార్జ్ ఆప్షన్లపై పలువురు వినియోగదారులు తనకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ సమస్యను మార్చి 11న పార్లమెంట్‌లో ప్రస్తావించి, వినియోగదారులకు మరిన్ని ఎంపికలతో పాటు అందుబాటు ధరల్లో రీఛార్జ్ ప్లాన్స్ కల్పించాలని కోరినట్లు చెప్పారు.
డేటా అవసరం లేని వినియోగదారుల కోసం కేవలం వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ సేవులతో కూడిన ప్లాన్స్ సైతం అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రాథమిక అవసరాల కోసం మొబైల్ ఫోన్ ఉపయోగించే తక్కువ బడ్జెట్ వినియోగదారులకు ఈ ప్లాన్స్ ఉపయోగకరంగా ఉండనున్నట్లు చెప్పారు.
అవసరానికి అనుగుణంగా ప్లాన్స్ ఎంచుకునే అవకాశం వినియోగదారులకు లభించనుందని, కొత్త నిబంధనలతో ప్రీపెయిడ్ వినియోగదారులు రీఛార్జ్ విషయంలో మరింత వెసులుబాటు కలిగించినట్లు అవుతుందని రాఘవ్ చద్దా వెల్లడించారు.

ఉగ్రవాదంపై నో కాంప్రమైజ్!

న్యూఢిల్లీ



ఉగ్రవాదం విషయంలో భారత్ ఎలాంటి రాజీకి తావివ్వదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని కొనసాగిస్తే ఎలాంటి సైనిక చర్యకైనా భారత్ పూర్తిగా సిద్ధంగా ఉందని తేల్చి చెప్పారు. ఎన్డీటీవీ డిఫెన్స్ కాన్క్లేవ్‌లో మాట్లాడిన ఆయన.. భారత్ శాంతిని కోరుకుంటుందని, ఇతర దేశాల భూభాగాన్ని ఆక్రమించాలనే ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు. అయితే భారత్ శాంతి కోరుకోవడాన్ని బలహీనతగా లేదా పిరికితనంగా భావించరాదని హెచ్చరించారు. జాతీయ భద్రత విషయంలో భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పించే దేశాలతో చర్చలకు కూడా ఆస్కారం లేదని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే విధానాలను అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశ భద్రతకు ముప్పు ఏర్పడితే అవసరమైన చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో భారత్ ఎదుగుదలపై కూడా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. భారత్‌కు 'థుసిడైడ్స్ ట్రాప్' వర్తించదని పేర్కొన్నారు. ఎదుగుతున్న శక్తి, ఆధిపత్య శక్తి మధ్య సంఘర్షణ తప్పదనే భావనను భారత్ విషయంలో అన్వయించలేమని తెలిపారు. భారత్ కేవలం ప్రపంచ శక్తుల మధ్య మార్పును కోరుకునే దేశం కాదని, సుదీర్ఘ నాగరికత, విలువలకు ప్రతీకగా ఉన్న శక్తి అని వివరించారు. విదేశాంగ విధానంలో జాతీయ ప్రయోజనాలకు భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని రక్షణ మంత్రి తెలిపారు. అదే సమయంలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కొనసాగిస్తూ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను కొనసాగిస్తూనే జాతీయ భద్రత, సార్వభౌమత్వం విషయంలో ఎలాంటి ఒత్తిడికీ తలొగ్గబోమని స్పష్టం చేశారు. భారత్ శాంతిని కోరుకుంటున్నప్పటికీ దేశ భద్రతకు సవాలు ఎదురైతే తగిన విధంగా స్పందించే సామర్థ్యం, సంకల్పం దేశానికి ఉన్నాయని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని ఆయన తేల్చి చెప్పారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

(మొదటి తరువాయి)

ఆయన భేటీ అవుతారు. ఢిల్లీలో పార్టీ జాతీయ నాయకత్వంతో సీఎం భేటీ కానుండటంతో రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న పలు పరిణామాల నేపథ్యంలో పార్టీ పెద్దలతో సీఎం భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులతో సమావేశాలు నిర్వహించడం సాధారణంగా కొనసాగుతోంది. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రంతో సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విషయాలు, పార్టీ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఆయన ఎప్పటికప్పుడు జాతీయ నాయకత్వంతో చర్చిస్తున్నారు. తాజాగా చేపట్టనున్న పర్యటనలోనూ పార్టీ ముఖ్యులతో భేటీ కావడం, ఏఐసీసీ సమావేశానికి హాజరు కావడం ప్రధాన కార్యక్రమాలుగా ఉన్నాయి. మంగళవారం ఢిల్లీలో జరిగే ఏఐసీసీ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సమావేశంలో పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరగనుంది. సమావేశంలో పార్టీ వ్యవహారాలు, భవిష్యత్ కార్యాచరణ, వివిధ రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితులు తదితర అంశాలపై



చర్చించే అవకాశం ఉంది. సమావేశానికి పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి కూడా సమావేశంలో పాల్గొననున్నారు. ఏఐసీసీ సమావేశం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. సమావేశం నిర్ణీత సమయానికి పూర్తయితే మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం ఉంది. ఒకవేళ సమావేశం ఆలస్యంగా ముగిసినా, ఢిల్లీలో ఇతర కార్యక్రమాలు కొనసాగినా మంగళవారం రాత్రి అక్కడే బస చేసి బుధవారం ఉదయం హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. సీఎం పర్యటనకు సంబంధించి అధికారిక షెడ్యూల్ మేరకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సిరిసిల్లలో పర్యటించనున్నారు. జిల్లాలో నిర్వహించే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. సిరిసిల్ల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. వరుసగా ఢిల్లీ, హైదరాబాద్, సిరిసిల్ల పర్యటనలతో సీఎం రేవంత్‌రెడ్డి షెడ్యూల్ బిజీగా కొనసాగనుంది. సోమవారం ఢిల్లీకి వెళ్లి మీడియా సంస్థ కార్యక్రమంలో పాల్గొని, కాంగ్రెస్ పార్టీ ముఖ్యులతో భేటీ కానున్నారు. మంగళవారం ఏఐసీసీ సమావేశానికి హాజరై అనంతరం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ఆ తర్వాత బుధవారం సిరిసిల్ల పర్యటనలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో పార్టీ జాతీయ నాయకత్వంతో జరిగే సమావేశాలు, ఏఐసీసీ భేటీపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

సర్'కు తొలి పరీక్ష ఖైరతాబాద్!

(మొదటి తరువాయి)

ముందు ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,93,667 మంది ఓటర్లు ఉన్నారు. అయితే డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలయ్యే సమయానికి ఈ సంఖ్య 1,70, 195కు తగ్గింది. 'సర్'లో భాగంగా ఎన్యుమరేషన్ ఫామ్‌లు సమర్పించినవారిని మాత్రమే డ్రాఫ్ట్ జాబితాలో చేర్చారు. 1,23,472 మంది పేర్లు తొలగించారు. వీరిని ప్రధానంగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటు (ఏఎస్‌డీడీ) క్యాటగిరీల కింద గుర్తించారు. తొలగించిన ఓటర్లలో అత్యధికంగా 95,082 మంది ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్టు ఎన్నికల అధికారులు గుర్తించారు. మరణించినవారు, డూప్లికేట్ ఓట్లు, ఇతర కారణాలతో గైర్హాజరైనవారిని కూడా ఏఎస్‌డీడీ క్యాటగిరీలో చేర్చారు.నగర పర్యటనలను అన్వేషించండి ఈ భారీ తొలగింపుతో ఖైరతాబాద్ నియోజకవర్గ ఓటర్ల సంఖ్యలో గణనీయమైన మార్పు చోటుచేసుకున్నది. అయితే డ్రాఫ్ట్ జాబితా ఆధారంగా తుది ఓటర్ల కూర్పుపై ఇప్పుడే స్పష్టమైన అంచనాకు రావడం సాధ్యం కాదు. 'సర్' ప్రక్రియలో మరో కీలక పరిణామంగా 81,404 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. 2002 నాటి జాబితాతో లింక్ కాకపోవడం, ఎన్యుమరేషన్ ఫామ్ వివరాల్లో వ్యత్యాసాలు ఉండటం వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చారు. నోటీసులకు సంబంధించి ఓటర్లు సమర్పించే వివరణలు, పత్రాలను పరిశీలించిన అనంతరం ఎంతమంది పేర్లు తుదిజాబితాలో తిరిగి చేరుతాయన్నది కీలకంగా మారింది. నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల దృష్టి ఇప్పుడు ఈ ప్రక్రియపైనే ఉన్నది.

2023లో 52.34 శాతం పోలింగ్

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,96,036 మంది ఓటర్లు ఉండగా, 1,53,730 ఓట్లు పోలయ్యాయి. అంటే 52.34 శాతం పోలింగ్ నమోదైంది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 67,368 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పీ విజయారెడ్డికి 45,358 ఓట్లు లభించాయి. గతంలో ఖైరతాబాద్‌లో 85 వేలకుపైగా బీసీ ఓటర్లు, 75 వేలకుపైగా ముస్లిం ఓటర్లు, 65 వేలకుపైగా ఎస్సీ ఓటర్లు ఉన్నట్టు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ వర్గాలు నియోజకవర్గంలోని ప్రధాన ఓటరు సమూహాలుగా ఉన్నా యి. అయితే 'సర్'లో భారీసంఖ్యలో పేర్లు తొలగించడం, వేలాది మందికి నోటీసులు జారీ చేయడం వల్ల తుది ఓటర్ల జాబితాలో ఈ సామాజికవర్గాల సంఖ్య ఎంతమేరకు మారుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తుదిజాబితా వెలువడిన తర్వాతే కొత్త ఓటర్ల కూర్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.

మారిన రాజకీయ సమీకరణాలు

ఖైరతాబాద్ ఉపఎన్నిక కేవలం ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేసే ఎన్నికగా కాకుండా, 'సర్' అనంతరం మారిన ఓటర్ల జాబితాతో జరిగే తొలి రాజకీయ పరీక్షగా మారనున్నది. డ్రాఫ్ట్ జాబితా, తుది జాబితా మధ్య ఎంతమేరకు మార్పులు ఉంటాయి? నోటీసులు అందుకున్నవారిలో ఎంతమంది తిరిగి ఓటర్లుగా నమోదవుతారు? నియోజకవర్గంలోని వివిధ సామాజికవర్గాల ఓటర్ల సంఖ్య ఎలా మారుతుంది? వంటి అంశాలు ఉపఎన్నికలో రాజకీయ పార్టీల వ్యూహాలను ప్రభావితం చేసే అవకాశం ఉన్నది. నవంబర్ 9న వెలువడే తుదిజాబితా ఎన్నికల సమీకరణాలకు కీలక ఆధారంగా మారనున్నది.

మరోసారి నేపాల్‌లో ప్రకృతి విలయం

ఢాకా:



మొన్నటివరకు వరదలతో అల్లాడిపోయిన నేపాల్‌లో తాజాగా విపత్తు సంభవించింది. ఈ ఉదయం భారీగా హిమపాతం చోటు చేసుకుంది. టిబెట్ సరిహద్దుల్లో ఉన్న మనాంగ్ జిల్లాలోని హిమ్‌లుంగ్ హిమాల్ పర్వతం బేస్ క్యాంప్‌పై భారీగా మంచు కొండ విరిగిపడటంతో పలువురు గల్లంతయ్యారు. వారిలో పర్వతారోహకులు, సహాయక సిబ్బంది ఉన్నారు. 7,126 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ పర్వతాల్లో కురుస్తున్న మంచు, వర్షాల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.
ఎక్స్పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ నేపాల్ జనరల్ సెక్రటరీ రిషి భండారీ ఈ విషాద ఘటనను ధృవీకరించారు. ఇప్పటివరకు 10 మంది ఆచూకీ తెలియరాలేదని వెల్లడించారు. పర్వతారోహకులలో ఇద్దరు ఇమాజిన్ నేపాల్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన వారు కాగా, మరో ఎనిమిది మంది హిమాలయన్ హాలిడేస్ నేపాల్ సంస్థ ద్వారా ట్రెక్కింగ్ కు వచ్చినట్లు సమాచారం. వారితో పాటు ఇద్దరు సహాయక సిబ్బంది కూడా గల్లంతైన వారిలో ఉన్నారని చెప్పారు.
హిమ్‌లుంగ్ హిమాల్ పర్వత ప్రాంతంలో గాలింపు చర్యలు ముమ్మరం చేయడం రెస్క్యూ బృందాలకు సవాల్ గా మారింది. ఈ ప్రాంతంలో హెలికాప్టర్లను నడపాలంటే ప్రత్యేక అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇది.. అత్యవసర రెస్క్యూ ఆపరేషన్కు అడ్డంకిగా మారింది. నేపాల్ పర్యాటక శాఖ డైరెక్టర్ జనరల్ రామ్ కృష్ణ లామిచానే దీనిపై మాట్లాడారు. రెస్క్యూను తాము పర్యవేక్షిస్తున్నామని, వివిధ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు చేపట్టామని అన్నారు. వాతావరణ మార్పుల కారణంగా నేపాల్ దేశవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని రోజులుగా కొండ ప్రాంతాల్లో ఎడతెరిపి లేని వర్షాలు, హిమాలయాల్లో భారీ మంచు కురుస్తోంది. ఫలితంగా పలు రహదారులు దెబ్బతిన్నాయి. రాకపోకలు స్తంభించాయి. కిందటి నెలలో రసువా జిల్లాలో సంభవించిన భీకర వరదల్లో దాదాపు 1,400 మందికి పైగా ప్రజలు కోల్పోగా, వందలాది ఇళ్లు కొట్టుకుపోయాయి.

రెండేళ్లలో కేసీఆర్ వస్తారు

(మొదటి తరువాయి)

అణచివేత ఎక్కువైతే సందర్భం వచ్చినప్పుడు గడ్డిపోచలు కూడా గద్దపారలుగా మారుతాయని హెచ్చరించారు. అందుకే గతంలో సజ్జనార్, కిషన్ రెడ్డి ఎదుట కూడా డేకే లెంగే వంటి పాటలు పెట్టుకొని డ్యాన్స్ చేశారని గుర్తు చేశారు. 'ది పారడైజ్' సినిమాలో కేటీఆర్ పాత్ర నాలుగు నిమిషాలు మాత్రమే ఉన్నప్పటికీ తమకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చిన నాయకుడిని ప్రజలు ఎలా గుర్తు చేసుకుంటున్నది అందులో కనిపిస్తుందని కేటీఆర్ అన్నారు. 30శాతం కమిషన్లు తీసుకుంటూ రియల్ ఎస్టేట్ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూల్చిందని కేటీఆర్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చేరికల కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నార్సింగి, సుల్తాన్‌పల్లి గ్రామాలకు చెందిన 500 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బి సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వి రాజు, మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, పుప్పాలగూడ మాజీ ఎంపీటీసీ పాపాలాల్ సింగ్, మణికొండ మాజీ సర్పంచ్ జైహింద్ రావు, మణికొండ కౌన్సిలర్ యాలాల లావణ్య తదితరులు ఉన్నారు. వీరిలో 90 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న వారు కూడా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు మెట్రో రైలు ఎప్పుడో వచ్చేదని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో మెట్రోకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ టెండర్‌ను రద్దు చేసిందని ఆరోపించారు.

దక్షిణాఫ్రికాలో సామూహిక కాల్పులు..

కొద్ది గంటల వ్యవధిలో రెండు ప్రాంతాల్లో కాల్పులు
జోహన్నెస్‌బర్గ్ సమీపంలో 17 మంది మృతి
కేప్‌టౌన్ శివారులో మరో 10 మంది బలి
రెండు ఘటనల్లో 26 మందికి గాయాలు
బార్ వద్ద కూర్చున్న వారిపై దుండగుల కాల్పులు
ఎనిమిది మంది దుండగులు కాల్పులకు తెగబడినట్లు సమాచారం
నాలుగు గంటల వ్యవధిలోనే మరో ఘటన
కాల్పులకు కారణాలపై కొనసాగుతున్న దర్యాప్తు



జోహన్నెస్‌బర్గ్/కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలో కొద్ది గంటల వ్యవధిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన సామూహిక కాల్పులు తీవ్ర కలకలం రేపాయి. జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్ సమీపాల్లో చోటుచేసుకున్న ఈ రెండు ఘటనల్లో మొత్తం 27 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 26 మంది గాయపడ్డారు. కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.శనివారం రాత్రి జోహన్నెస్‌బర్గ్‌కు సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని వెడెలా టౌన్‌షిప్‌లోని ఓ బార్ వద్ద తొలి ఘటన చోటుచేసుకుంది. ఎనిమిది మంది దుండగులు బార్ బయట కూర్చున్న వారితో పాటు లోపల ఉన్నవారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 17 మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు.ఈ ఘటన జరిగిన నాలుగు గంటలకే కేప్‌టౌన్ శివారులోని లాండ్స్‌వేల్ టౌన్‌షిప్‌లో మరో సామూహిక కాల్పుల ఘటన జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంట దాటిన తర్వాత ఓ దుకాణంపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయపడ్డారు. కొద్ది గంటల వ్యవధిలోనే రెండు ప్రాంతాల్లో సామూహిక కాల్పులు జరగడంతో దక్షిణాఫ్రికాలో భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండు ఘటనలకు సంబంధం ఉందా? కాల్పులకు పాల్పడిన వారి ఉద్దేశం ఏమిటన్న దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

యూపీలో భారీ వర్షాల బీభత్సం..

డైనమిక్ బ్యూరో



ఉత్తరప్రదేశ్‌ను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, వాటి కారణంగా చోటుచేసుకున్న ప్రమాదాల్లో రాష్ట్రవ్యాప్తంగా 56 మంది మృతిచెందారు. మరో 46 మంది గాయపడ్డారు. సీతాపుర్ జిల్లాలో అత్యధికంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు పలు జిల్లాల్లో వరద పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో సాధారణంగా 24 గంటల్లో 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుండగా.. గత 24 గంటల్లో ఏకంగా 45.1 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 75 జిల్లాల్లో 56 జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఫరూఖాబాద్ జిల్లాలో సాధారణం కంటే ఏకంగా 7,385 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాన్పూర్, వారణాసి, ప్రయాగ్‌రాజ్, గోరఖ్‌పుర్, బరేలీ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికిపైగా ఇళ్లు ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. రహదారులపై భారీగా నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఘాఘ్రా, రాప్తి నదుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించింది. నదుల్లో నీటిమట్టం మరింత పెరిగితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉన్నావ్ జిల్లాలోని సోనిక్ టోల్‌ప్లాజా వద్ద గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది.

సంపాదకీయం

వినబడటం లేదా.. బొద్దింకల రణన్నినాదం?



శుక్రవారంనాడు కొన్ని జాతీయ ఆంగ్ల దినపత్రికలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోతో 'ఇండియా రోర్స్ లౌడర్ దాన్ ఎవర్' అంటూ ఒక ఆకర్షణీయమయిన వ్యాపార ప్రకటనను ప్రచురించాయి. భారతదేశం మునుపెన్నడూ లేనంత బిగ్గరగా గర్జిస్తున్నదని దానర్థం. ఇది ప్రధానమంత్రికి అత్యంత ప్రియమయిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి సంబంధించిన ప్రకటన. ఉత్పత్తులు పెంచడంలోనో, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలోనో ఈ గర్జన బిగ్గరగా వినిపిస్తే అందరికీ సంతోషమే. ఇవాళ భారత్ మునుపెన్నడూ లేనంత బిగ్గరగా గర్జిస్తున్నది, ఏమని? కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్ట్ చేసి విచారణ జరపాలని. కోట్లాదిమంది ఓట్లను తొలగించడం ద్వారా పాల్పడిన చోరీ కేసులో ఆయనను అరెస్ట్ చెయ్యాలని ప్రతిపక్షాలు పట్టుబట్టుతున్నాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట కేంద్ర ఎన్నికల సంఘం 2025 లో బీహార్ రాష్ట్రంతో ప్రారంభించి మొత్తం 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముసాయిదా ఓటర్ల జాబితా నుండి 13 కోట్లకు పైగా పేర్లను తొలగించింది. ఈ సంఖ్య ఒక చిన్న దేశ జనాభాతో సమానం. ఈ చర్య దేశంలో ఎవరికి ఓటు హక్కు కల్పించాలో, ఎవరి ఓట్లు తొలగించాలో నిర్ణయించే గురుతర బాధ్యత నిర్వర్తించవలసిన వ్యవస్థ విశ్వసనీయత మీద నీలినీడలు పరిచింది. ఓట్లు తొలగించాలని నిర్ణయించిన కారణాలను అధికారికంగా వెల్లడించే ప్రయత్నం జరగకపోవడం దుర్మార్గం. మాట మాట్లాడితే ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయపక్షానికి చెందినవారు 'గుస్పేటి' అనే ఒక పదం వాడుతుంటారు. అంటే చొరబాటుదారులు అని అర్థం. నిజంగానే పొరుగు దేశాలనుండి ఇంత పెద్ద సంఖ్యలో చొరబడ్డారా? అప్పుడు మన నిఘా వ్యవస్థ, భద్రతా దళాల సామర్థ్యం ప్రశ్నార్థకం కావడం లేదా? ఇలాంటి బాధ్యతగల స్వతంత్ర వ్యవస్థలకు పారదర్శకత అవసరం కదా, ఆ చొరబాటుదారుల పేర్లు దేశ ప్రజల ముందు పెట్టరు ఎందుకని?. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దాదాపు సంవత్సర కాలంగా ఈ వ్యవహారంలో జరిగిన అవకతవకలు, అక్రమాలమీద పెద్దయెత్తున ప్రచారం సాగించినా జనాన్ని జాగరూకులను చేసేందుకు ప్రయత్నిస్తున్నా రాని ఫలితం 'ఇండియన్ ఎక్స్ ప్రెస్' దినపత్రిక రాసిన పరిశోధనాత్మక కథనంతో సాధ్యమైంది. కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు ఈ వ్యవహారంలో ఎన్ని అభ్యంతరాలు చెప్పినా 'ప్రతిపక్షాల పని అయిపోయింది, ప్రజలు వారితో లేరు' అని కొట్టిపారేస్తూ వచ్చిన భారతీయ జనతా పార్టీ గొంతులో ఈ వార్తతో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. ఈ వార్తకు ఆధారాలు ఏమిటనే ఒక బలహీనమయిన వాదన కొద్దిమంది అధికారపక్ష నేతల చేత మీడియా ముందు వినిపింపజేస్తున్నారే తప్ప అటు ప్రధానమంత్రి కానీ, ఇటు కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ కానీ తమ వైపునుండి ఎటువంటి తప్పూ జరగలేదని ప్రజల ముందుకొచ్చి వివరించే ప్రయత్నం, వారిలో నమ్మకం కల్పించే ప్రయత్నం చెయ్యడం లేదు. దానికి కారణం ఉంది. ఒకటి కాదు చాలా తప్పులు జరిగాయి. 'ఇండియన్ ఎక్స్ ప్రెస్' దినపత్రిక కథనం ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లలో ఇద్దరు అధికారికంగా లేవనెత్తిన అభ్యంతరాల ఆధారంగా రాసినది. పలు అంశాలలో తమ దృష్టికి రాకుండానే నిర్ణయాలు జరిగిపోయాయనీ, వాటిలో కొత్త ఓటర్లను చేర్చుకోవడం, ఉన్న ఓటర్లను తీసివెయ్యడం వంటి చర్యలు కూడా ఉన్నాయని ఆ ఇద్దరు కమిషనర్లు ఫిర్యాదు చేసారు. రాష్ట్రాలస్థాయిలో ఉన్న అధికారుల ప్రమేయం లేకుండా కొత్త ఓటర్ల నమోదును కేంద్రీకృతం చెయ్యడం చట్టవ్యతిరేకమనేది ఆ ఇద్దరి వాదన. ఈ విషయంలో ఈ ఇద్దరు కమిషనర్లు క్యాబినెట్ కార్యదర్శికి మొరపెట్టుకున్నట్టు కూడా వార్తలు వచ్చాయి. కేంద్ర ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యాంగబద్ధ వ్యవస్థ. అది స్వతంత్రంగా పనిచెయ్యాలి. క్యాబినెట్ కార్యదర్శి శరణు వేడారంటేనే అది కేంద్రప్రభుత్వం చెప్పుచేతల్లోకి ఎంతగా వెళ్ళిపోయిందో అర్థం అవుతోంది.

గత పది మాసాల కాలంలో ఆ ఇద్దరు కమిషనర్లు కనీసం 14 సందర్భాలలో తమ అభ్యంతరాలను అధికారికంగా తెలియజేయడమే కాకుండా ఒకే రోజున వారు తమకు తెలియకుండా ఉత్తర్వులు జారీ అయినందుకు నాలుగుసార్లు అభ్యంతరాలు లేవనెత్తారు. అయినా కమిషనర్ల గోడు పట్టించుకున్న నాథుడు లేడు. పట్టించుకోవలసిన చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇంకెవరి ఆదేశాలనో అమలుచేసే పనిలో తలమునకలై ఉన్నారు. ఆయనను చీఫ్ కమిషనర్ గా నియమించడం కోసమే 2023 లో చట్టసవరణ చేసి భారత ప్రధానన్యాయమూర్తి స్థానంలో కేంద్రమంత్రిని సభ్యుడిగా చేర్చుకున్నప్పుడు ఆ మాత్రం స్వామిభక్తి ప్రదర్శించకపోతే ఎలా అని అనుకుని ఉంటారాయన. కేంద్ర ఎన్నికల సంఘంలో జరుగుతున్న ఈ వ్యవహారం బయటపడటంతో ఇప్పుడు దేశ యువత, విద్యార్థులు మరో జంతర్ మంతర్ ఉద్యమానికి ఉద్యుక్తులయ్యారు. జెన్ జీకి ప్రతినిధిగా ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ విద్య గురించి కదా పట్టించుకోవాలి, రాజకీయాలతో వాళ్లకేం పని అంటూ అధికారపక్షం సన్నాయినొక్కులు ప్రారంభించింది. ఈ దేశ ప్రజల అత్యంత ప్రధానమైన ఓటుహక్కు విషయంలో ఇంత దుర్మార్గం జరుగుతుంటే వాళ్లకు (జెన్ జీకి) కాక ఇంకెవరికి పట్టాలి? అందుకే వాళ్ళు మళ్ళీ బయటికి వస్తున్నారు. 'కాక్రోచెస్ వాపస్ ఆవో' నినాదం అధికారంలో ఉన్నవారిని హైరానాకు గురిచెయ్యక తప్పదు. జెన్ జీ ప్రతినిధిగా ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ మూడు డిమాండ్లను ముందుకు తెచ్చింది. మొదటిది చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, రెండవది 2023 లో ఆ పదవికి నియామకం కోసం చేసిన కొత్తచట్టాన్ని రద్దు చెయ్యడం, మూడవది కేంద్ర ఎన్నికల సంఘం ప్రక్షాళన జరిగేవరకు వచ్చే ఏడాదికాలంలో జరగాల్సిన రాష్ట్రాల ఎన్నికలను నిలిపివెయ్యడం. ఈ మూడు కోరికలూ సమంజసమైనవే. ఇంతజరిగాక జ్ఞానేశ్ కుమార్ ను ప్రతిపక్షాలు కోరుతున్నట్టు అరెస్ట్ చేసి కేసు పెట్టకపోయినా, ఆయన కనీస నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చెయ్యాలి. ప్రస్తుతం చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఉన్న జ్ఞానేశ్ కుమార్ 2023 కొత్త నియామక చట్టం కింద నియమితులైన తొలి సీఈసీ. ఆ చట్టం ప్రకారం నియామక కమిటీలో ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్రమంత్రి ఉండటంతో అప్పటినుంచే ఈ వ్యవస్థ స్వతంత్రతపై చర్చ మొదలైంది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన కేసుల విచారణ ఇంకా కొనసాగుతోంది. నిజమే, ఇంత లోపభూయిష్టమైన వ్యవస్థను పెట్టుకుని ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా ఎలా జరుగుతాయి? వచ్చే ఏడాది ఎన్నికలన్నీ వాయిదా వెయ్యాల్సిందే. ఇంత జరిగాక ముగ్గురు ఎన్నికల కమిషనర్లు తాజాగా సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కానక్కరలేదంటూ మినహాయింపు ఇవ్వడం విచిత్రం. ఇంతకాలం తమ ఓటు హక్కు కాపాడుకునేందుకు ఓటర్లు పడిన అష్టకష్టాలకు బాధ్యత ఎవరు వహిస్తారు? గత కొంతకాలంగా దేశంలో ఇందుకు సంబంధించి నెలకొన్న పరిణామాలలో మూడు అంశాల గురించి తప్పనిసరిగా చర్చించుకోవాలి. మొదటిది, ప్రతిపక్షనేతగా రాహుల్ గాంధీ ఎదిగివచ్చిన తీరు, ఆయన పరిణతి చెందుతున్న తీరు. రాహుల్ గాంధీకి 57 ఏళ్ళు వచ్చినా ఇంకా రాజకీయ చరిత్ర తెలియదని విమర్శిస్తున్నవాళ్ళూ, రిటైర్మెంట్ దగ్గర పడింది ఇంకేం రాజకీయాలు చేస్తాడని గొణుగుతున్నవాళ్ళు 57 సంఖ్యను తిరగేస్తే వచ్చే 75 ఏళ్ళ వయసు దాటుతున్నవాళ్ళు ఈ దేశ విశ్వసనీయత ప్రపంచం ముందు పరిహాసం పాలయ్యే పనులు జరుగుతుంటే ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని గుర్తు చేసుకొంటే మంచిది. రెండవది ప్రధాన స్రవంతి మీడియా అని మనం చెప్పుకునే వ్యవస్థ అధికారం ముందు సాగిలపడుతున్న వాతావరణంలో ఒక చిన్న ఆశగా 'ఇండియన్ ఎక్స్ ప్రెస్' కేంద్ర ఎన్నికల సంఘం బండారాన్ని బయట పెట్టే పరిశోధనాత్మక కథనం ప్రచురించడం. మూడవది, ఆఖరుది ఈ దేశ రాజకీయాలను కూడా ప్రక్షాళన చేసేందుకు జెన్ జీ నడుం బిగించడం. అవును భారతదేశపు యువత మునుపెన్నడూ లేనంత బిగ్గరగా గర్జిస్తున్నది, వినండి.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం

- బీఆర్ఎస్ -- టిబీజీకేఎస్ పిలుపు



రామగిరి,సెప్టెంబర్ 27 మహాప్రభ

స్వాతంత్ర్య సమరయోధుడు,మాజీ శాసనసభ్యుడు,తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్),తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబీజీకేఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ,తెలంగాణ సమాజం కోసం, కార్మికులు,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఆయన చూపిన నిజాయితీ, నిబద్ధత,ప్రజాసేవా భావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిబీజీకేఎస్ ఆర్జీ-3 ఏ ఏపీఏ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగేల్లి సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షులు శంకేసి రవీందర్, టిబీజీకేఎస్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈసంపల్లి రమేష్,సీహెచ్పీ ఇన్‌చార్జ్ బుద్దే ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వయస్సుతో సంబంధం లేకుండా విద్యతోనే వెలుగు...

-ఉల్లాస్ పరీక్షపై అవగాహన కార్యక్రమం

-సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు



రామగిరి, సెప్టెంబర్ 27 మహాప్రభ

ఉల్లాస్ అనేది కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన పథకమని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమా పివి రావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉల్లాస్ పరీక్ష నిర్వహించారు.15 ఏళ్లు పైబడిన వారు తమకు నచ్చిన విషయాలలో చదువు కొనసాగించడానికి,విభిన్న రంగాలలో నైపుణ్యాలను పెంపొందించకోవడానికి అవకాశం కల్పిస్తుంది.వయసు కాదు.. చదువు ముఖ్యమన్నారు.ఉల్లాస్ ద్వారా లభించే ప్రయోజనాలు చేకూరుతాయి. విద్యా అభ్యాసానికి రెండో అవకాశం. వృత్త నైపుణ్యాల అభివృద్ధి,ఉద్యోగ,స్వయం ఉపాధి అవకాశాలు కలిపిస్తారు. సామాజక, ఆర్థిక అభివృద్ధి,స్వయం సమృద్ధి సాధన జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిఏ కలికోట అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

రామగిరి,సెప్టెంబర్ 27 మహాప్రభ

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీ తెలంగాణ చౌరస్తాలో రామగిరి మండల పద్మశాలి సంఘం కమిటీ ఆధ్వర్యంలో పద్మశాలి ముద్దుబిడ్డ, తెలంగాణ ఉద్యమ నేత,స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు అనేక ప్రజా పోరాటాల్లో కీలక పాత్ర పోషించిన మహనీయుడని కొనియాడారు.ప్రజల హక్కుల పరిరక్షణ,సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు.నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన



పోరాటంలో పాల్గొన్న బాపూజీ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా మంత్రి పదవికి రాజీనామా చేసి తన నిబద్ధతను చాటుకున్నారని తెలిపారు.చేనేత రంగ అభివృద్ధికి,పద్మశాలి సమాజ అభ్యున్నతికి కొండా లక్ష్మణ్ బాపూజీ విశేష కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు.చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితుల మెరుగుదల,వారి హక్కుల పరిరక్షణ కోసం అండగా నిలిచారని గుర్తుచేశారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ చేనేత రంగ అభివృద్ధికి,కార్మికుల సంక్షేమానికి,సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొలుపాక సత్తయ్య,మండల గౌరవ అధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి,మండల అధ్యక్షులు బండారి సదానందం,మండల ఉపాధ్యక్షులు చిలువేరు స్వామి,పన్నూర్ గ్రామ వార్డు సభ్యులు తన్నీరు ప్రదీప్,గౌడ వైష్ణవి,రత్నాపూర్ గ్రామ అధ్యక్షులు కట్టెకోల సంపత్ కుమార్,సంఘం సభ్యులు, యువత,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సముద్రాల పరమేశ్వర్ కు చాకలి ఐలమ్మ స్మారక పురస్కారం

-అభినందించిన ప్రముఖులు, ఆత్మీయ మిత్రులు

(హనుమకొండ)సెప్టెంబర్ 27 మహాప్రభ

బహుజన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు -- బహుజన వీరనాది చాకలి ఐలమ్మ ఫౌండేషన్, తెలంగాణ మరియు రజక మిత్రమండలి వరంగల్ జిల్లా వారు -- మడేలయ్య దేవాలయ కమిటీ దోబీ ఘాట్ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బహుజన సామాజిక వర్గాలకు సముద్రాల పరమేశ్వర్ పరంజీ అని పిలవబడుతూ తను కుల వర్గ వర్ణ విభేదం అంటూ లేకుండా బహుజన సామాజిక వర్గాలకు తన జీవితకాలం ఉన్నతమైన సామాజిక అభ్యున్నతికి సామాజిక మార్పు కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న సందర్భంగా చాకలి ఐలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "చాకలి ఐలమ్మ స్మారక పురస్కారం" తనకు ఒక మహోన్నత సామాజిక సేవా



తత్పరుడుగా గుర్తించి శాలువా మెమెంటో తో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా సత్కరించిన సందర్భంగా తన చిరకాల ఆత్మీయ మిత్రులు ఘనంగా శాలువా కప్పి సత్కరించి తమను మరింత కాలం బహుజన సామాజిక వర్గానికి మంచి ఉన్నతమైన సామాజిక నిర్మాణానికి తను ఉత్సాహంగా కృషి చేస్తూ బహుజనుల బాగు కోసం బాటలు వేస్తూ అభివృద్ధికి నోచుకోని బహుజనులను చైతన్య పరుస్తూ ఉండాలని తమ ప్రేమను అభినందన రూపంలో శాలువా కప్పి పుష్పగుచ్చాలు ఇచ్చి ఈ కార్యక్రమం లో పాల్గొన్న ప్రముఖుల సమక్షంలో తమ అభిమానాన్ని చాటుకున్నారు. . ఈ కార్యక్రమంలో తెలుగు అకాడమీ పుస్తక ప్రచురణ విభాగం తెలంగాణ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ,మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మాజీ కార్పొరేటర్స్ తోట వెంకన్న కానుగంటి శేఖర్ , దూపం సంపత్, ప్రతాపగిరి శ్రీనివాసు అధ్యక్షులు హనుమకొండ జిల్లా మేదరి మహేంద్ర సంఘం,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం మస్న బిక్షపతి,బాకం హరిశంకర్ ఉప్పల లక్ష్మణ్ చలం శ్రీలం లక్ష్మణ్, రాపెల్లి నీలకంఠం,రాజు తదితరులు.

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో అతిపెద్ద భారీ విగ్రహం

రామాయంపేట సెప్టెంబర్ 27 మహాప్రభ

రామాయంపేట పట్టణంలో దుర్గమ్మ బస్తికి చెందిన దుర్గా గణేష్ మండలి సభ్యులు గత 30 సంవత్సరాల నుండి వినాయకుని పెట్టడం జరుగుతుంది ఈసారి అతిపెద్ద భారీ విగ్రహాన్ని దుర్గా గణేష్ మండలి సభ్యులు మరియు గల్లి పెద్దలు సహకారంతో ఈ యొక్క విగ్రహాన్ని ఏర్పాటు చేశారు దీనికి బస్తి ప్రజలు చిన్నారులు పెద్దలు కో లాటాలతో ఆటపాటలతో భజనలతో నిత్యం కార్యక్రమాలు నిర్వహించారు అలాగే





వినాయకుని నిమగ్నం రోజున ద్రాపెట్టి ద్రాలో బహుమతులు వెళ్లిన వారికి బహుమతులు అందజేశారు దీనికి కమిటీ సభ్యులు సంఘసభ్యులు అందరూ సహకరించి ఈ యొక్క నిమ్మ జ్ఞానాని విజయవంతంగా నిర్వహించారు

ఘనంగా దేవరకొండలో ప్రపంచ పర్యాటక దినోత్సవం

దేవరకొండ సెప్టెంబర్ 27(మహా ప్రభ)
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు దేవరకొండ ఖిల్లా వద్దా విద్యార్థులకు పర్యాటక దినోత్సవం గురించి వివరించి, దేవరకొండ ఖిల్లా ఘనత గురించి వివరించినారు. ఈ సందర్భంగా అధ్యక్షుడ ఎన్.వి.టి. మాట్లాడుతూ పర్యాటకం యొక్క ప్రాముఖ్యతను, దాని సామాజిక, సాంస్కృతిక, రాజకీయ మరియు ఆర్థిక విలువలను అంతర్జాతీయ సమాజానికి తెలియజేయడం.ప్రముఖ్యతపర్యాటక రంగం ద్వారా గ్లోబల్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సాధించడం.పర్యావరణ పరిరక్షణ, ఉపాధి అవకాశాలు మరియు స్థానిక ఆర్థిక వ్యవస్థలను పెంపొందించడం.డిజిటల్ టెక్నాలజీ మరియు కృత్రిమ మేధ (ఎ.ఐ) సాయంతో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం అని అన్నారు. దేవరకొండ ఖిల్లా గురించి మాట్లాడుతూ తెలంగాణలోని నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఏడు కొండల మధ్య చారిత్రక వైభవంతో విరాజిల్లుతున్న ఒక ప్రసిద్ధ గిరి దుర్గమే దేవరకొండ ఖిల్లా (కోట)అని,కోటను 14వ శతాబ్దంలో రేచెర్ల పద్మనాయక వెలమ రాజులు నిర్మించారనీ, ఇది



1287 నుండి 1482 వరకు వెలమ రాజుల పరిపాలనలో కీలక కేంద్రంగా ఉండేదనీ, ప్రసిద్ధుడైన మాడ నాయుడు పాలనలో ఈ కోట మరింత అభివృద్ధి చెందిందనీ, శత్రువులకు దుర్భేద్యంగా ఉండేలా సుమారు ఏడు కొండలను కలుపుతూ సువిశాలమైన రక్షణ గోడలతో దీనిని నిర్మించారనీ, ఈ కోట ముఖద్వారంలో చెక్కబడిన "పూర్ణకుంభం" (కలశం) ఈ ప్రాంతపు చారిత్రక ప్రతీకగా నిలుస్తుందనీ, ఖిల్లా పరిసరాల్లో అప్పట్లో నిర్మించిన రామాలయం, ఆంజనేయస్వామి మరియు శివాలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయనీ, ఇక్కడి రాతి శిల్పకళా చాతుర్యం ఎంతో ఆకట్టుకుంటుందనీ, చుట్టూ కొండలు, అడవులు, ప్రకృతి అందాలతో ఈ కోట ట్రెక్కింగ్ చేయడానికి మరియు చరిత్రను తెలుసుకోవడానికి అనువైన ప్రదేశం అని అన్నారు. దేవరకొండ కిల్లాను పర్యాటక స్థలంగా తీర్చిదిద్దాలని ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోవాలని సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, ఎ ఐఎస్. ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, కరాటే మాస్టర్ గోపి, అభిరామ్, నిరంజన్, వెంకటేష్, ప్రవీణ్, మల్లేష్, త్రినేత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి వేళ సిద్ధయోగ కుటీరంలో ఆధ్యాత్మిక జ్యోతి





-అఖండ జపం, ధ్యానంతో అంతరంగ శాంతి..
- గురుభక్తితో సిద్ధయోగ సాధన

దేవరకద్ర సెప్టెంబర్ 27
మహాప్రభ దేవరకద్ర నియోజకవర్గం
పౌర్ణమిని పురస్కరించుకుని దేవరకద్రలోని సిద్ధయోగ కుటీరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేరళ పీఠం స్వామి శివానంద పరమహంస వారి శిష్య బృందంతో పాటు రామానంద స్వామి, లక్ష్మానంద స్వామి శిష్య బృందాల ఆధ్వర్యంలో సిద్ధ విద్యార్థులు అఖండ జపం, అఖండ ధ్యానంలో పాల్గొన్నారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన సాధనతో కుటీరం ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోయింది. సిద్ధయోగ సంప్రదాయంలో గురువు మార్గదర్శకత్వం--శిష్యుని సాధనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గురువు చూపిన ఆత్మసాధనా మార్గంలో శిష్యుడు క్రమశిక్షణతో ధ్యానం, జపం, యోగసాధన కొనసాగిస్తే మనస్సులోని చంచలత్వం క్రమంగా తగ్గి అంతరంగ ప్రశాంతతకు మార్గం ఏర్పడుతుందని ఆధ్యాత్మిక మార్గదర్శకులు పేర్కొంటారు. గురువుపై విశ్వాసం, వినయం, నిరంతర సాధన సిద్ధయోగంలో కీలకమైన అంశాలుగా భావిస్తారు.

అఖండ జ్యోతి.. అఖండ ధ్యానం
సిద్ధయోగ కుటీరంలో ప్రతి పౌర్ణమికి అఖండ జ్యోతి, అఖండ ధ్యానం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అఖండ జ్యోతి వెలుగును అంతరంగంలోని జ్ఞానజ్యోతికి ప్రతీకగా భావిస్తూ సిద్ధ విద్యార్థులు ధ్యాన సాధనలో నిమగ్నమవుతున్నారు. ధ్యానం కేవలం కళ్లుమూసుకుని కూర్చోవడం మాత్రమే కాకుండా.. మనస్సును పరిశీలిస్తూ, ఆలోచనల ప్రవాహాన్ని గమనిస్తూ, అంతరంగాన్ని ప్రశాంతత వైపు నడిపించే సాధనగా సిద్ధయోగులు వివరిస్తున్నారు. నిత్య జీవితంలోని ఒత్తిళ్లు, ఆందోళనలు, ఆలోచనల మధ్య కొంత సమయం ధ్యానానికి కేటాయించడం ద్వారా మనిషి తనలోకి తాను చూసుకునే అవకాశం కలుగుతుంది.

**"స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాంతరే భ్రువోఃఃః

పోరాట స్ఫూర్తికి ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ.

-మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్.



మెదక్ జిల్లా -27సెప్టెంబర్ (మహాప్రభ,).
స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంక్ సమీపంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, బిఆర్ఎస్ నాయకులు మరియు పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాంతం పోరాడారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ కోసం తన మంత్రి పదవికి సైతం రాజీనామా చేసిన గొప్ప తెలంగాణవాది అని కొనియాడారు. చివరి శ్వాస వరకు తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం ఆయన ప్రజాసేవకు దక్కిన గౌరవానికి నిదర్శనమన్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లు మాయ మల్లేశం,బీమారి కిషోర్,ఆర్కే శ్రీనివాస్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్, నాయకులు లింగా రెడ్డి, ,తుమ్మ. లక్ష్మీనారాయణ,గంగారాం, అరుణ్,వర్షిత్, పద్మశాలి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషన్ చైర్మన్ రాజీనామా చేయాలి

దేవరకొండ సెప్టెంబర్ 27 (మహాప్రభ)
నల్గొండ పట్టణం క్లాక్ టవర్ సెంటర్ లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోడీ ప్రభుత్వానికి తొత్తుగా మారి దేశ ప్రజల ఓటును దొంగలిస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్ చైర్మన్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ గుర్రశి శ్యామ్, జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్,దేవరకొండ మండల అధ్యక్షులు ముకురోజు రాజు, మరియు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు అసెంబ్లీ అధ్యక్షులు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు అసెంబ్లీ సభ్యులు పాల్గొన్నారు...

త్యాగానికి నిలువెత్తైన నిదర్శనం కొండ లక్ష్మణ్ బాపూజీ

-ఘనంగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు



గాంధారి, సెప్టెంబర్ 27:(మహాప్రభ)
స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, పద్మశాలీల ముద్దుబిడ్డ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు గాంధారి మండల కేంద్రంలో ఆదివారం రోజున ఉదయం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు గుంటుకు అశోక్, పట్టణ సంఘ అధ్యక్షులు క్యాతం కృష్ణ, సామల రాజు, శివ, బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం ఆయన ఆశయాలు, చేసిన సేవలను స్మరించుకోనున్నారు.– తెలంగాణ కోసం తన మంత్రి పదవినే త్యాగం చేసిన నిస్వార్థ నాయకుడు, పద్మశాలి సమాజానికి గర్వకారణం, చేనేత కార్మికుల వెన్నుముకగా నిలిచిన ఉద్యమకారుడు. జీవితాంతం విలువలతో కూడిన రాజకీయాలకు కట్టుబడి, యువతకు ఆదర్శంగా నిలిచిన మహనీయుడు. “తెలంగాణ నా ఊపిరి” అంటూ చివరి శ్వాస వరకు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ధీరుడు, త్యాగానికి నిలువెత్తిన నిదర్శనం కొండ లక్ష్మణ్ బాపూజీ, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోశాధికారి కార్యదర్శులు, సలహాదారులు, ప్రభు, సంతోష్, సత్యం, భాస్కర్, శ్రీనివాస్, లక్ష్మణ్, కుల సంఘం సభ్యులు, యువకులు, తదితరులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

పెద్దవంగరలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 111వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

పెద్దవంగర, సెప్టెంబర్ 27 (మహాప్రభ)
: పెద్దవంగర మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.
కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఇంటెలెక్చ్యువల్ ఫోరం కన్వీనర్ డాక్టర్ కూరపాటి రమేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ ఇంటెలెక్చ్యువల్ ఫోరం కోఆర్డినేటర్ డాక్టర్ కూరపాటి రాధిక, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శి, పెద్దవంగర మండల



పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమకారుడని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కులు, సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.
బీసీ వర్గాలు రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా నిలిచి తమ రాజ్యాంగబద్ధ హక్కులను సాధించుకునేందుకు సంఘటితంగా ముందుకు రావాలని, బీసీల ఐక్యత మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా బీసీ ఇంటెలెక్చ్యువల్ ఫోరం కోఆర్డినేటర్ ఎదునూరి శ్రీనివాస్, మండల పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు గుల్లపల్లి సదానందం, వడ్డే కొత్తపల్లి గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రాజు, గుడ్ల రమేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుమ్మరి రామ్మూర్తి, వెంకట్ నారాయణ యాదవ్, రాష్ట్ర కోఆర్డినేటర్ లికొంగ వీరస్వామిలితో పాటు పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పరిడ విల్లిన మెదక్ సంస్కృతి వైభోగం





-16 కళారూపాల తో ప్రపంచ పర్యాటక దినోత్సవ ర్యాలీ
-ప్రపంచానికి అన్నం పెట్టింది మెతుకు సీమ
-మెదక్ పర్యాటక కేంద్రాలను ప్రపంచానికి పరిచయం చేయాలి
--మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు





మెదక్ జిల్లా -27సెప్టెంబర్ (మహాప్రభ).
ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లాలో ఆదివారం 4000 మంది తో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మెదక్ ఖిల్లా పై కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,మెదక్ మున్సిపల్ చైర్పర్సన్ రాధిక భూపతి రాజులు జెండా ఊపి ప్రారంభించారు ప్రారంభించారు.మెదక్ ఖిల్లా సందర్శనార్థం టికెట్ కౌంటర్ ను ప్రారంభించారు. మెదక్ ఖిల్లా నుంచి వెస్లీ కళాశాల వరకు భారీ ఎత్తున ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో డప్పు, డోలు, తంబుర, చిందు, భాగవత, బోనాలు,బతుకమ్మ, గిరిజన లంబాడి, గీతా కార్మికులు ,కరాటే , ఎన్సిసి విద్యార్థులు ,ఒగ్గు తదితర తదితర కళాకారులు వారి వేషధారణలో పాల్గొన్నారు.
అనంతరం వెస్లీ కళాశాలలో పర్యాటక రంగ ఏవీ నీ వీక్షించారు . శాంతి సందేశానికి సూచికగా ఎంపీ,కలెక్టర్,అదనపు ఎస్పీ , మున్సిపల్ చైర్పర్సన్ తెల్లటి పావురాలను ఎగురవేసి, మెదక్ పర్యాటక రంగా అధికారిక వెబ్ సైట్ ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రపంచానికి అన్నం పెట్టిన చరిత్ర మెతుకు సీమ మెదక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పర్యాటక రంగంలో మొదటి బహుమతి పొందిన కలెక్టర్ ప్రతిమా సింగ్ ను అభినందించారు. మోదీ నాయకత్వంలో భారతదేశంలో పర్యాటక రంగం చాలా అభివృద్ధి సాధించిందని ప్రపంచంలో ఉన్న 175 దేశాలు భారతదేశానికి పర్యాటక సంస్థలను సందర్శిస్తున్నారని అన్నారు. భారత్ టూరిజం లో చాలా ముందుకెళ్తుందని తెలిపారు. శని, ఆదివారాల్లో పర్యాటక ప్రేమికుల దృశ్య ట్రాఫిక్ నియంత్రించాలని సూచించారు.
మెదక్ జిల్లా ప్రకృతి కాపాడాలన్నారు. ప్రకృతి , టూరిస్ట్ ప్రదేశాల్లో ప్లాస్టిక్ నిషేధించాలని సూచించారు. ప్లాస్టిక్ బదులుగా స్టీల్ వస్తువులను ఉపయోగించాలన్నారు. జిల్లా యంత్రాంగం పర్యాటక అభివృద్ధి కోసం జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో మెదక్ జిల్లా వెనకబడిందన్నారు.కలెక్టర్ ప్రతిమా సింగ్ వచ్చిన తర్వాత మెదక్ అభివృద్ధికి కొత్త ఊపొచ్చిందని ప్రశంసించారు.ఆదిలాబాద్, ములుగు జిల్లాలకు పోటీగా మెదక్ టూరిజం అభివృద్ధి చెందుతోందని తెలిపారు.పోచారం అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ పార్క్, ఏడుపాయల వనదుర్గ, మెదక్ చర్చి తదితర ప్రాంతాల మరింత అభివృద్ధి చేయాలన్నారు. మెదక్ జిల్లాను ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ కృషి చేస్తుందన్నారు.
నర్సాపూర్ అడవుల అందాలను సినీ పరిశ్రమ కూడా గుర్తించిందన్నారు. పర్యాటక అభివృద్ధితో హోటళ్లు, టూరిస్ట్ గైడ్లు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రపంచ చిత్రపటం లో టూరిజం ర్యాంకింగ్ విషయంలో భారతదేశం 69వ స్థానంలో ఉండేదని, నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక టూరిజం విషయంలో. 69 నుంచి 39 వ స్థానానికి ఎదిగిందన్నారు.
ప్రపంచ పర్యాటక పటంలో భారత్ స్థానం మెరుగుపడుతోందనీ వివరించారు. మెదక్ పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్థానిక భాష నేర్చుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.
మన ప్రాంతంలో పుట్టిన మనమే మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.
కలెక్టర్ కలలు కంటున్న టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.
మన ఊరు.. మన ప్రాంతం.. మనమే రక్షించుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో చాలా చారిత్రక వారసత్వ , సాంస్కృతిక సంపద, కలిగి ఉందని , దానిని భావితరాల కు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. పర్యాటక సర్క్యూట్ గా చేసేందుకు 14 ప్రదేశాలను గుర్తించామన్నారు. మెదక్ జిల్లా పర్యాటక ప్రదేశాలను ప్రపంచ స్థాయి గుర్తింపు తేవడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లాలో టూరిజం అభివృద్ధి చెందితే స్థానిక ప్రజలకే ఉద్యోగ ఉపాధి మార్గాలు లభిస్తాయని తెలిపారు.
జిల్లా అదనపు ఎస్పి విక్రమ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ .. జిల్లా చారిత్రక ప్రదేశాలను, వారసత్వ సంపదను భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవాలన్నారు.
మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో అనేక వారసత్వ సంపదను కలిగి ఉండడం జిల్లా ప్రజల అదృష్టం అన్నారు. వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తరలివచ్చి మెదక్ ను సందర్శించేలా ప్రజల సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగంపై చదివిన కవిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
అనంతరం పర్యాటక దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మేమంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.
ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈవో, జిల్లా టూరిజం అధికారి ఎల్లయ్య, మెదక్ ఆర్డీవో రమాదేవి , డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, స్పోర్ట్స్ ఆఫీసర్ రమేష్, మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాకారుడు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీరంగాపురానికి నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం

-జీవో ఆర్టీ నెంబర్.597తో నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి..
-రూ.2 కోట్ల 25 లక్షలు మంజూరు
-ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో కార్యరూపం

వనపర్తి సెప్టెంబర్ 27 మహాప్రభ
–ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి
–రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి
–జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు కి
–జిల్లా మంత్రి వాకిటి శ్రీహరి కి
–ఎంపీ డా. మల్లు రవి కి
ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల కేంద్రానికి నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం మంజూరైంది. రెవెన్యూ డిఏ-సి ఎం ర్ ఫ్ శాఖ జిఓర్టినే.597, తేదీ 26-09-2026 ద్వారా నూతన మండల రెవెన్యూ కార్యాలయ భవన నిర్మాణానికి





GOVERNMENT OF TELANGANA
ABSTRACT
Revenue (DA. CARF) Department - Construction of new office buildings of RDO Office in Nagarkurnool District (01) and Tahsildar Offices (07) in various Mandals -Orders Issued.
REVENUE (DA. CARF) DEPARTMENT
G.O.RT.No.597 Dated:26.09.2026.
Read the following:-
1. G.O.Rt.No.375, Revenue (DA-CARF) Department, Dated:25.06.2026.
2. G.O.Rt.No.427, Revenue (DA-CARF) Department, Dated:14.7.2026.
3. G.O.Rt.No.428, Revenue (DA-CARF) Department, Dated:14.7.2026.
4. From the District Collector,Hanumakonda RC.No. E2/170/2025, Dated:13.08.2026.
5. From the District Collector, Jagtial, Lr.No. E1/886/2026, Dated:21.09.2026.
ORDER:
In the references 1-3 read above, orders were issued for construction of new office buildings of RDO and Tahsildar Offices.
2. Further, on receipt of representations and proposals of the District Collectors, Government hereby accord orders for Construction of new office buildings of RDO Office in Nagarkurnool District (01) and Tahsildar Offices (07) in various Mandals of respective Districts.

Sl.No.	Revenue Divisional Office	District
1.	Nagarkurnool	Nagarkurnool

Sl.No.	Mandal Revenue Office	District
1	Beerpur	Jagtial
2	Regonda	Bhupalapalli
3	Mogulapalli	Bhupalapalli
4	Srirangapur	Wanaparthy
5	Hanumakonda	Hanumakonda
6	Bheemgal	Nizamabad
7	Buggaram	Jagtial

3. The Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad is requested to take necessary action in the matter.
4. This order issues with the concurrence of Finance (EBS.VI) Department, vide their U.O.No.474/11/A1/EBS.VI/2026, dated:13.04.2026.
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
LOKESH KUMAR D.S.
SECRETARY TO GOVERNMENT

ప్రభుత్వం రూ. 2 కోట్ల 25 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఆధునిక వసతులతో నూతన కార్యాలయ భవనం నిర్మాణం చేపట్టనుండటంతో శ్రీరంగాపురం మండల ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి రానున్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, రెవెన్యూ పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు ఈ భవనం దోహదపడనుందనీ ఎంఎల్ ఏ పేర్కొన్నారు వనపర్తి నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతులను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చొరవతో శ్రీరంగాపురానికి ఈ నూతన కార్యాలయం మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీరంగాపురం మండల అభివృద్ధికి సహకరిస్తూ నూతన తహసీల్దార్ కార్యాలయ భవనానికి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బిజినెస్

వారంలో రూ.10 వేల తగ్గిన వెండి ధర



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు వారం వ్యవధిలో గణనీయంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న మార్పులు, పెట్టుబడిదారుల కొనుగోళ్లలో హెచ్చుతగ్గులు వంటి అంశాల ప్రభావంతో విలువైన లోహాల ధరల్లో మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో వారం రోజుల వ్యవధిలో బంగారం ధరలు తగ్గగా.. వెండి ధర ఏకంగా రూ.10 వేల మేర పడిపోయింది. ఈ నెల 20న హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,840గా ఉంది. వారం రోజుల తర్వాత ఈ ధర రూ.3,160 తగ్గి రూ.1,52,680కు చేరింది. దీంతో 24 క్యారెట్ల పసిడి ధరలో స్వల్పంగా తగ్గుదల నమోదైంది. ఇదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర కూడా తగ్గింది. ఈ నెల 20న 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రూ.1,42,850గా ఉండగా.. ప్రస్తుతం రూ.2,900 తగ్గి రూ.1,39,950కు చేరింది. మరోవైపు వెండి ధరలో మాత్రం మరింత స్పష్టమైన తగ్గుదల కనిపించింది. కిలో వెండి ధర వారం వ్యవధిలో రూ.10 వేల మేర తగ్గింది. ఈ నెల 20న కిలో వెండి ధర రూ.2,60,000గా ఉండగా.. ప్రస్తుతం రూ.2,50,000కు చేరింది. దీంతో వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించినట్లయింది. బంగారం, వెండి ధరలు రోజువారీగా మారుతూ ఉంటాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్ మారకం విలువ, దేశీయ డిమాండ్, పెట్టుబడిదారుల కొనుగోళ్లు వంటి పలు అంశాలు ధరలపై ప్రభావం చూపుతాయి. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు గత వారంతో పోలిస్తే తక్కువ స్థాయిలో కొనసాగుతున్నాయి. అయితే మార్కెట్‌లో ప్రకటించే ధరలకు అదనంగా పన్నులు, ఇతర ఛార్జీలు వర్తిస్తాయి. ప్రస్తుతం బంగారం, వెండి ధరలపై 3 శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఆభరణాల కొనుగోలుపై తయారీ చార్జీలు కూడా ఉండటంతో తుది ధర మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల కొనుగోలు చేసే సమయంలో తాజా మార్కెట్ ధరతో పాటు జీఎస్టీ, తయారీ చార్జీలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

పండగ సీజన్ వేళ.. భారీగా పెరగనున్న ఏసీ, టీవీల ధరలు



పండగ సీజన్ ప్రారంభానికి ముందే వినియోగదారులకు గృహోపకరణాల కంపెనీలు షాక్ ఇచ్చాయి. ఏసీలు, ఎల్ఈడీ టీవీలు, వాషింగ్ మెషిన్లు, రిఫ్రిజిరేటర్లు సహా పలు కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు కంపెనీలు ప్రకటించాయి. అక్టోబర్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీంతో పండగల సమయంలో కొత్తగా గృహోపకరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి అదనపు భారం పడనుంది. ఏసీల ధరలు 5 నుంచి 8 శాతం వరకు పెంచనున్నట్లు తెలుస్తోంది. ఇతర గృహోపకరణాల ధరలు 3 నుంచి 4 శాతం వరకు పెరగనున్నాయి. ముఖ్యంగా పండగ సీజన్‌లో టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, ఏసీలకు డిమాండ్ పెరిగే సమయంలో ధరల పెంపు వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముడిపదార్థాల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందని కంపెనీలు చెబుతున్నాయి. ముఖ్యంగా కాపర్, స్టీల్, ప్లాస్టిక్ వంటి కీలక ముడిపదార్థాల ధరల్లో పెరుగుదల చోటుచేసుకోవడంతో తయారీ ఖర్చులు పెరిగినట్లు పేర్కొంటున్నాయి. దీనికి తోడు రూపాయి విలువలో హెచ్చుతగ్గులు కూడా దిగుమతుల వ్యయంపై ప్రభావం చూపుతున్నాయని కంపెనీలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావం కూడా ముడిసరుకులు, రవాణా వ్యయాలపై పడుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఉత్పత్తుల ధరలను సవరించాల్సి వస్తోందని కంపెనీలు పేర్కొంటున్నాయి. అక్టోబర్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రావడంతో పండగ కొనుగోళ్ల బడ్జెట్‌ను వినియోగదారులు మరోసారి పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే వెంటనే అన్ని ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం లేకపోవచ్చు. డీలర్ల వద్ద ఇప్పటికే ఉన్న పాత స్టాక్ కారణంగా కొన్ని ఉత్పత్తులు కొంతకాలం పాత ధరలకే లభించే అవకాశముంది. ముఖ్యంగా దీపావళి వరకు పాత స్టాక్‌ను విక్రయించే అవకాశం ఉండటంతో కొన్ని మోడళ్లపై ధరల పెంపు ప్రభావం ఆలస్యంగా కనిపించవచ్చు. అందువల్ల పండగ సీజన్‌లో ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు వంటి గృహోపకరణాలు కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్, కొత్త ధరలను సరిపోల్చుకోవడం ద్వారా కొంత ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

యూపీఐ మార్కెట్‌లోకి యాపిల్ ఎంట్రీ!



భారత్‌లో డిజిటల్ చెల్లింపుల రంగంలోకి యాపిల్ అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. యాపిల్ పే సేవలను దేశంలో అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ ప్రయత్నాలు చేస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. తొలిదశలో క్రెడిట్ కార్డుల ఆధారంగా 'ట్యాప్ అండ్ పే' సేవలను ప్రారంభించే అవకాశం ఉంది. ఇందులో భాగంగా తొలుత యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులకు ఈ సదుపాయం అందుబాటులోకి రావచ్చని సమాచారం. యాపిల్ పే సేవలు అందుబాటులోకి వస్తే ఐఫోన్, యాపిల్ వాచ్ వినియోగదారులు పీఓఎస్ మెషీన్లపై నేరుగా ట్యాప్ చేసి చెల్లింపులు చేయొచ్చు. ఇందుకోసం కార్డును భౌతికంగా వినియోగించాల్సిన అవసరం ఉండదు. యాపిల్ పరికరాల్లో కార్డు వివరాలను అనుసంధానం చేసుకుని సులభంగా లావాదేవీలు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అయితే తొలిదశలో యాపిల్ పేలో యూపీఐ చెల్లింపుల సదుపాయం ఉండకపోవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం క్రెడిట్ కార్డు ఆధారిత చెల్లింపులకే సేవలను పరిమితం చేసే అవకాశం ఉంది. భవిష్యత్తులో యూపీఐ మద్దతును కూడా తీసుకురావాలని యాపిల్ భావిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అదే జరిగితే భారత్‌లో యాపిల్ పేకు మరింత విస్తృతమైన వినియోగదారుల వర్గం ఏర్పడే అవకాశం ఉంటుంది. దేశంలో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ సేవలు విస్తృతంగా వినియోగంలో ఉన్నాయి. యాపిల్ పేకు భవిష్యత్తులో యూపీఐ మద్దతు లభిస్తే ఈ సంస్థలతో పోటీ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐఫోన్, యాపిల్ వాచ్ వినియోగదారులకు యూపీఐతో పాటు ఇతర డిజిటల్ చెల్లింపు సదుపాయాలు ఒకే వేదికపై అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వినియోగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో యాపిల్ పే ప్రవేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే సేవల అధికారిక ప్రారంభ తేదీ, ఏయే బ్యాంకుల క్రెడిట్ కార్డులకు మద్దతు లభిస్తుంది, యూపీఐ సదుపాయం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

స్పోర్ట్స్

హై జంప్‌లో 'వెండి' ధమాకా.. కాంస్యంతో మెరిసిన పరుల్, తేజస్విన్..!



: పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత్ అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. ఎనిమిదో రోజు హై జంప్‌లో అన్సీ సోజన్ త్రుటిలో స్వర్ణం చేజార్చుకోగా, పురుషుల విభాగంలో సర్వేష్ కుశారే (ఝుతీజవంష్ఠ ఖబంష్ఠుతీవ) చరిత్రాత్మక వెండితో అదరగొట్టాడు. డెకథ్లాన్‌లో అంచనాలు అందుకున్న తేజస్విన్ శంకర్ కాంస్యం గెలుపొందగా.. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో పరుల్ చౌదరీ అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శనతో కంచు మోత మోగించింది.
నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు జోరు చూపిస్తున్నారు. మహిళల 200 మీటర్ల ఫైనల్లో హరిత భత్రా కంచు మోత మోగించిన కాసేపటికే లాంగ్ జంప్, డెకత్లాన్, స్టీపుల్ ఛేజ్‌లో పతకాలతో అదరగొట్టింది మన బృందం. మహిళల లాంగ్ జంప్ ఫైనల్లో సత్తా చాటిన అన్సీ సోజన్ అనూహ్యంగా రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఐదో ప్రయత్నంలో 6.53 మీటర్ల దూరం దూకిన తను పసిడి పక్కా అనుకుంది.కానీ, చైనా అథ్లెట్ హుయాంగ్ ఇంగింగ్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ 6.55 మీటర్ల జంప్‌తో స్వర్ణం ఎగరేసుకుపోయింది. ఇదే విభాగంలో కాంస్యంపై ఆశలు పెట్టుకున్న శైలిల్ సింగ్‌కు సైతం చుక్కెదురైంది. 6.41 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన ఆమెను 6.46 మీటర్లతో టాన్ మంగీ(జపాన్) వెనక్కి నెట్టి పతకం పట్టుకుపోయింది.
చరిత్రాత్మక సిల్వర్
పురుషుల హై జంప్‌లో సర్వేష్ కుశారే వెండి వెలుగులు విరజిమ్మాడు. ఫైనల్లో అతడు ఏకంగా 2.25 మీటర్లు జంప్ చేసి.. చరిత్రాత్మక పతకం ఒడిసిపట్టాడు. అయితే.. అతడు రెండో ప్రయత్నంలో ఈ దూరం అందుకోగా.. తొలి ప్రయత్నంలోనే ఇంత దూరం దూకిన సుహాన్ ఫు(చైనీస్ తైపీ) కు స్వర్ణం దక్కింది. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ తనకు తిరుగులేదని చాటాడు.పది క్రీడల్లో సత్తా చాటిన అతడు చివరిదైన 1500 మీటర్ల పరుగులో అగ్రస్థానం సాధించాడు. కానీ,7,934 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన అతడు దేశానికి కాంస్యం అందించాడు. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో పరుల్ చౌదరీ అంచనాలు నిలబెట్టుకుంది. 9:08.67 సెకన్ల టైమింగ్‌తో లక్ష్యాన్ని పూర్తి చేసి తను కాంస్యంతో మురిసింది. ఇదే విభాగంలో భారత అథ్లెట్ అంకిత నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

హైజంప్‌లో వెండి ధమాకా.. కాంస్యంతో మెరిసిన పరుల్, తేజస్విన్!



పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. ఎనిమిదో రోజు అథ్లెటిక్స్‌లో భారత్‌కు పలు పతకాలు దక్కాయి. మహిళల లాంగ్‌జంప్‌లో అన్సీ సోజన్ త్రుటిలో స్వర్ణాన్ని చేజార్చుకుని రజతంతో సరిపెట్టుకోగా.. పురుషుల హైజంప్‌లో సర్వేష్ కుశారే చారిత్రాత్మక వెండి పతకంతో మెరిశాడు. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ కాంస్యం సాధించగా.. మహిళల 3,000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పరుల్ చౌదరీ అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శనతో కాంస్య పతకం సొంతం చేసుకుంది. నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు వరుసగా పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నారు. మహిళల 200 మీటర్లలో హరిత భత్రా కాంస్యం సాధించిన కొద్దిసేపటికే లాంగ్‌జంప్, డెకథ్లాన్, స్టీపుల్‌చేజ్ విభాగాల్లోనూ భారత క్రీడాకారులు పతకాలు కొల్లగొట్టారు. మహిళల లాంగ్‌జంప్ ఫైనల్లో అన్సీ సోజన్ అద్భుత ప్రదర్శన చేసింది. ఐదో ప్రయత్నంలో 6.53 మీటర్ల దూరం దూకిన ఆమె స్వర్ణం సాధించేలా కనిపించింది. అయితే చివరి దశలో చైనా అథ్లెట్ హుయాంగ్ ఇంగింగ్ అద్భుతంగా పుంజుకుంది. 6.55 మీటర్ల దూరం దూకి అన్సీని వెనక్కి నెట్టి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. దీంతో అన్సీ సోజన్ రజతంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగంలో భారత్‌కు మరో పతకం దక్కుతుందని భావించిన శైలీ సింగ్‌కు నిరాశ ఎదురైంది. ఆమె 6.41 మీటర్ల దూరంతో మూడో స్థానంలో నిలిచింది. అయితే జపాన్ అథ్లెట్ టాన్ మంగీ 6.46 మీటర్లతో శైలీని అధిగమించి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. పురుషుల హైజంప్‌లో సర్వేష్ కుశారే భారత్‌కు చారిత్రాత్మక రజత పతకాన్ని అందించాడు. ఫైనల్లో 2.25 మీటర్ల ఎత్తును అధిగమించిన అతడు రెండో ప్రయత్నంలో ఈ ఘనత సాధించాడు. దీంతో హైజంప్‌లో భారత్‌కు విలువైన రజతం దక్కింది. చైనీస్ తైపీకి చెందిన సుహాన్ ఫు తొలి ప్రయత్నంలోనే 2.25 మీటర్ల ఎత్తును అధిగమించడంతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ అంచనాలకు తగ్గట్టుగా రాణించాడు. పది విభాగాల్లోనూ సత్తా చాటిన అతడు చివరి ఈవెంట్ అయిన 1,500 మీటర్ల పరుగులో అగ్రస్థానంలో నిలిచాడు. మొత్తం 7,934 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. దీంతో భారత ఖాతాలో మరో అథ్లెటిక్స్ పతకం చేరింది. మహిళల 3,000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పరుల్ చౌదరీ కూడా సత్తా చాటింది. 9:08.67 సెకన్లలో రేసును పూర్తి చేసిన ఆమె కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ ప్రదర్శనతో తన అత్యుత్తమ వ్యక్తిగత రికార్డును నమోదు చేసింది. ఇదే విభాగంలో మరో భారత అథ్లెట్ అంకిత నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఎనిమిదో రోజు అథ్లెటిక్స్‌లో వరుసగా పతకాలు సాధించడంతో భారత బృందంలో ఉత్సాహం నెలకొంది. ముఖ్యంగా సర్వేష్ కుశారే రజతం, తేజస్విన్ శంకర్, పరుల్ చౌదరీ కాంస్య పతకాలతో భారత అథ్లెటిక్స్ బృందం సత్తా చాటింది.

ఒక్కరోజులో మూడు మ్యాచ్‌లా?..

ఆసియా క్రీడల నిర్వాహకులపై సింధు ఫైర్..!



ఆసియా క్రీడల్లో పతకం గెలవాలనుకున్న పీవీ సింధు కల చెదిరింది. క్వార్టర్ ఫైనల్లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించిందీ తెలుగు తేజం. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్ యుఫీ(చైనా) చేతిలో కంగుతిన్న సింధు నిర్వాహకులపై మండిపడింది. ఒక్కరోజులో మూడు మ్యాచ్‌లు ఏంటీ? అసలు ఇదేం షెడ్యూల్? అంటూ ఫైర్ అయిందీ ఒలింపిక్ విజేత. అంతేకాదు కోర్టులో రివ్యూ కెమెరాలు లేకపోవడాన్ని కూడా సింధు తప్పుపట్టింది.జపాన్‌లోని ఐచీ నగోయలో జరుగుతున్న 18వ ఆసియా క్రీడల్లో పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సింధు క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ఆదివారం చైనా షట్లర్ చెన్ యుఫీపై 21-11తో తొలి సెట్ గెలుపొందిన సింధు ఆ తర్వాత తడబడింది. నాలుగో సీడ్ ధాటికి వరసగా రెండు సెట్లను 18-21, 10-21తో కోల్పోయిన తెలుగుతేజం టోర్నీ నుంచి వైదొలిగింది. అయితే.. బిజీ షెడ్యూల్ కారణంగా సరిపోను మ్యాచ్ సన్నద్ధత లేకపోవడం వల్లనే తాను ఓటమి పాలయ్యానని సింధు వాపోయింది.భారత స్టార్ ఒక్క రోజులనే మూడు మ్యాచ్‌లు ఆడింది. శనివారం ఉదయం 12:07 గంటలకు రెండో మ్యాచ్ ఆడిన తను.. ఆదివారం చెన్ యుఫీతో క్వార్టర్ ఫైనల్ కోసం కోర్టుకు వచ్చేసింది. దాంతో.. తీరిక లేకుండా ఆడడం, నిద్ర లేకపోవడానికి తోడు సరైన నిర్వహణ లోపించడం కారణంగా పతకం చేజారిందని సింధు తెలిపింది.



నాని 'ది ప్యారడైజ్' మరో రికార్డు!

మూడు రోజుల్లో రూ.136 కోట్లు..



నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. విడుదలైన మొదటి రోజు నుంచే భారీ వసూళ్లను రాబడుతున్న ఈ చిత్రం.. తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. ఇప్పటికే నాని కెరీర్‌లో వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటిన సినిమాగా నిలిచిన 'ది ప్యారడైజ్'.. మూడు రోజుల్లోనే రూ.136 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమా మూడు రోజుల బాక్సాఫీస్ వసూళ్లకు సంబంధించిన వివరాలను మేకర్స్ తాజాగా పోస్టర్ ద్వారా వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా మూడు రోజుల్లో ఈ చిత్రం రూ.136 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ప్రకటించారు. మూడో రోజు సుమారు రూ.22 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు ఈ లెక్కల ద్వారా తెలుస్తోంది.రెండో రోజుతో పోలిస్తే మూడో రోజు వసూళ్లలో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ.. అది పెద్దగా ప్రభావం చూపలేదని ట్రేడ్ వర్గాల అంచనా. ముఖ్యంగా వారాంతపు రోజుల్లో సినిమాకు వస్తున్న స్పందనతో వసూళ్లు స్థిరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆదివారం కూడా మూడో రోజు స్థాయిలోనే వసూళ్లు నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. అదే జరిగితే సినిమా త్వరలోనే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌కు చేరువయ్యే అవకాశముంది. మరోవైపు నాలుగో రోజు గంటల వారీగా నమోదవుతున్న బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఇప్పుడు అందరి దృష్టి సోమవారం నుంచి మొదలయ్యే ఎంత వసూళ్లు రాబడుతుంది అనే దానిపై ఉంది. వారాంతపు జోరును కొనసాగిస్తూ సినిమా స్థిరమైన వసూళ్లను సాధిస్తుందా? లేక వసూళ్లలో గణనీయమైన డ్రాప్ కనిపిస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. ది ప్యారడైజ్ చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. నాని సరసన కాయదు లోహర్ నటించగా.. మంచు మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. తెలంగాణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో యాక్షన్‌తో పాటు సామాజిక అంశాలను కూడా దర్శకుడు కథలో భాగంగా చూపించినట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమా.. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కొనసాగుతున్న వసూళ్లతో నాని కెరీర్‌లో మరో ముఖ్యమైన చిత్రంగా నిలుస్తోంది

వారితో ప్రయాణం ప్రమాదకరం



'బంధాలకు పునాది నమ్మకమే. ఆ నమ్మకం ఒక్కసారి ఒమ్మయితే, పరిస్థితుల్ని మళ్లీ పూర్వస్థితికి తీసుకురావడం అసాధ్యం' అంటున్నది అందాలభామ కాజల్ అగర్వాల్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మానవ సంబంధాలు, మానసిక ప్రశాంతతలపై ఆసక్తికరంగా మాట్లాడింది కాజల్. '(ప్రేమ, స్నేహం, కుటుంబం, వృత్తి.. ఇలా ఎక్కడైనా సరే.. నమ్మకద్రోహానికి ఒడిగట్టే వ్యక్తులకు జీవితంలో స్థానం ఇవ్వకూడదు.స్వార్థపూరిత ఆలోచనలతో నమ్మకాన్ని తుంగలో తొక్కే వారితో కలిసి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరం. పైకి నవ్వుతూ, లోపల స్వార్థాన్ని దాచుకునే వారిని గుర్తించి, వారికి దూరంగా ఉండటమే శ్రీరామరక్ష. అవసరాల కోసం స్నేహాన్నీ, సంబంధాలనూ వాడుకునే స్వార్థపరులు ప్రతి రంగంలోనూ ఉంటారు' అని కాజల్ వ్యాఖ్యానించింది. ఈ మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

స్పీడు పెంచిన కీర్తి సురేష్..



సినిమాలు మానేసి హిమాలయాలకు వెళ్లిపోదామనుకున్నా..

నివేదా పేతురాజ్ సంచలన విషయాలు

'మెంటల్ మది' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి నివేదా పేతురాజ్ తన అందం, నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించి మెప్పించిన ఆమె.. ఓ దశలో సినిమాలకు పూర్తిగా దూరమవ్వాలని కూడా నిర్ణయించుకున్నారట. కొన్ని వ్యక్తిగత పరిస్థితులు, తీసుకున్న నిర్ణయాల కారణంగా తీవ్ర ఒత్తిడికి గురైన నివేదా.. ఏకంగా హిమాలయాలకు వెళ్లి ధ్యానం చేసుకుంటూ జీవించాలని అనుకున్నానని తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం మాత్రం మళ్లీ వరుస అవకాశాలతో నటిగా బిజీ అవుతున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'లో ఆమె కీలక పాత్రలో నటిస్తున్నారు.కొన్నేళ్ల క్రితం తన రూపంలో మార్పులు చేసుకోవాలనే ఆలోచన తనకు వచ్చిందని నివేదా తెలిపారు. ముఖ్యంగా పెదవుల ఆకారం కోసం శస్త్రచికిత్స చేయించుకోవాలని అనుకున్నారట. ఈ విషయంపై తన వ్యక్తిగత వైద్యుడిని సంప్రదించగా.. ఆయన తీవ్రంగా మందలించడంతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల గురించి వివరించారని చెప్పారు. దీంతో ఆ ఆలోచనను విరమించుకున్నట్లు తెలిపారు. సాయి పల్లవి, నిత్యామీనన్ వంటి నటీమణులు ఎలాంటి శస్త్రచికిత్సలు చేయించుకోకుండానే, తమ సహజ రూపంతోనే ప్రేక్షకుల ఆదరణ పొందుతున్నారని గుర్తుచేసుకున్నారు. వాళ్లను చూసిన తర్వాత తనకు కూడా తన రూపం గురించి అనవసరంగా ఎందుకు ఆలోచిస్తున్నాననే విషయం అర్థమైందని నివేదా పేర్కొన్నారు. తనకు ఒక విచిత్రమైన అనుభవం ఉందని నివేదా చెప్పారు. తాను మనసులో ఏదైనా ప్రతికూలంగా ఊహించుకుంటే అది నిజమైపోతుందనే భావన కలిగేదని తెలిపారు. తన వ్యక్తిగత జీవితంలోనూ అలాంటి సంఘటన ఎదురైందని చెప్పారు. తన మాజీ ప్రియుడు తనను ఎవరి కోసం వదిలి వెళ్లొచ్చనే విషయాన్ని ముందే ఊహించానని, చివరకు అదే జరిగిందని వెల్లడించారు. ఆ తర్వాత నుంచి ఏ విషయాన్నీ ముందుగానే ఊహించకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. అయితే మనసులో ఆలోచనలు రావడం సహజమే కదా అంటూ తన అనుభవాన్ని పంచుకున్నారు., 2023లో సినిమాలు మానేయాలని నిర్ణయించుకున్నానని నివేదా తెలిపారు. ఆ సమయంలో కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్నానని, దాని ప్రభావంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యానని చెప్పారు. డిప్రెషన్‌తో పాటు పానిక్ అటాక్స్ కూడా ఎదురయ్యాయని వెల్లడించారు. ఆ పరిస్థితుల నుంచి బయటపడటానికి చాలా కష్టపడ్డానని చెప్పిన నివేదా.. మళ్లీ సినిమా అవకాశాలు రాకపోతే హిమాలయాలకు వెళ్లి ధ్యానం చేసుకుంటూ జీవించాలని కూడా నిర్ణయించుకున్నానని తెలిపారు. అయితే పరిస్థితులు మారడంతో మళ్లీ నటనపై దృష్టి పెట్టానని చెప్పారు

చీరకట్టులో మలబారు సోయగం మాళవిక మోహనన్.. స్టిల్స్ వైరల్



తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది మాళవిక మోహనన్ . నెట్టింట ఈ భామ ఫొటోలు షేర్ చేసిందంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మోడ్రన్ డ్రెస్సుల్లో హాట్ హాట్ లుక్స్‌లో సందడి చేస్తూ కుర్రకారు గుండెలను పిండేసే ఈ ముద్దుగుమ్మ తాజాగా ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి ఔరా అనిపిస్తుంది. మోడ్రన్ లుక్‌లోనైనా సంప్రదాయక చీర కట్టులోనైనా అందంలో డామినేట్ చేయాలంటే నా తర్వాతే ఎవరైనా అంటూ చెప్పకనే చెబుతోంది.తాజాగా మాళవిక మోహనన్ చీరకట్టులో దర్శనమిచ్చింది. సాఫ్ట్ పింక్ ఎంబ్రాయిడరీ శారీలో జుంకాలతో హొయలుపోతూ కెమెరాకు ఫోజులిచ్చింది. చూసేందుకు రెండు కండ్లు చాలవా అన్నట్టుగా ఉన్న మలబారు సోయగం స్టిల్స్ సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి. ఈ భామ నటించిన రాజాసాబ్, సర్దార్ 2 సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టి తీవ్ర నిరాశనే మిగిల్చాయి.

లేడీ ప్రభాస్ అంటుంటారు..



'కేజీఎఫ్' వేదికగా సినీరంగ ప్రవేశం చేసిన కన్నడ బ్యూటీ శ్రీనిధిశెట్టి. మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకొని.. కన్నడ, తమిళ భాషల్లో వరుసగా సినిమాలు చేసింది. హిట్ 3, తెలుసుకదా సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. తాజాగా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'లో విక్టరీ వెంకటేశ్‌తో జతకట్టింది. ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శ్రీనిధి పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి...చదువుతోపాటు డ్యాన్స్, వాలీబాల్, త్రో బాల్, స్విమ్మింగ్ క్రీడల్లో ముందుండేదాన్ని. డాక్టర్ అవ్వాలన్నది నా కల. కానీ, ఇంజినీరింగ్ చదివి, ఉద్యోగం చేశా. నటనపై ఆసక్తితో మోడలింగ కెరీర్ ప్రారంభించా. ఇండస్ట్రీలో ఒకప్పుడు పెద్దయిన నటీమణులు మాత్రమే తల్లి పాత్రలు వేస్తుండేవారు. కానీ, ప్రస్తుతం ట్రెండ్ మారింది. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో ఐశ్వర్య రాజేష్... తల్లి పాత్రలో ఒదిగిపోయింది. మనకు ఇచ్చిన పాత్రకు న్యాయం చేయడమే నాకు తెలిసిన యాక్టింగ్. చాలామంది నెటిజన్లు అంతపెద్ద పాత్ర ఇంత చిన్న వయసులో చేయొద్దని కామెంట్లు పెట్టారు. సినిమా చూసిన తరువాత మీ అభిప్రాయం మార్చుకుంటారని భావిస్తున్నా.మనసుకు ప్రశాంతనిచ్చే పనులు చేస్తా. అందుకే గత శివరాత్రికి ఈషా ఫౌండేషన్ వేడుకలకు హాజరయ్యా. ఆ రోజంతా శివుడి ధ్యానంలోనే గడిపా. ఎంతో ఊరట చెందా! సామాజిక మాధ్యమాల్లో అంతగా కాలక్షేపం చేయలేను. హీరో ప్రభాస్ కూడా ఎక్కువ వాడడని విన్నాను. చాలాసార్లు నేను లేడీ ప్రభాస్‌నని మా స్నేహితులంతా పిలుస్తుంటారు. అది కూడా మన మంచికే కదా అని నవ్వి ఊరుకుంటాను. రామాయణ చిత్రంలో వచ్చిన అవకాశాన్ని వదులుకున్నానని కొందరు ట్రోల్ చేస్తున్నారు. అది అబద్ధం. సీత పాత్ర కోసం నేను ఆడిషన్ ఇచ్చిన మాట వాస్తవమే! కానీ, ఆ పాత్రకు నన్ను ఎంపిక చేయలేదు. సీతమ్మ పాత్రలో నటించే అవకాశం వస్తే ఎందుకు వదులుకుంటాను చెప్పండి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com